PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 316 | విజయవాడ, బుధవారం 18 జూన్ 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 18 June 2025 | Rs



# మోడీ సర్కారు మౌనం వీడాలి

**• పాలస్తీనా సంఘీభావ కార్యక్రమంలో వామపక్షాల డిమాండ్ • ఇజ్రాయిల్ దాడులకు ఖండన**

- సైనిక సహకారాన్ని నిలిపివేయండి : ఎంఏ బేబి
- దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ప్రదర్శనలు



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన సంఘీభావ సభలో మాట్లాడుతున్న సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ఇజ్రాయిల్ దాడులతో అతలాకుతలమౌతున్న పాలస్తీనాకు దేశ వ్యాప్తంగా సంఘీభావం వ్యక్తమైంది. వామపక్షాల పిలుపుమేరకు దేశ రాజధాని ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాల్లో సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించారు. పాలస్తీనాలో చిన్నారులు, మహిళలపై ఇజ్రాయిల్ చేస్తున్న అమానవీయ చర్యలను ఖండించారు. ఇజ్రాయిల్ క్రూరమైన దాడులపై మోడీ ప్రభుత్వం మౌనం వీడాలని, బాధిత పాలస్తీనా పట్ల మానవీయతను ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్), ఆర్‌ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్, సిజిపిఐ తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు దేశమంతట జరిగాయి. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన సంఘీభావ సభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి మాట్లాడుతూ ఇజ్రాయిల్‌ను ఒ మోసపూరిత రాజ్యంగా అభివర్ణించారు. ఇటీవల పహల్గామ్ (కాశ్మీర్)లో అమాయక పౌరులపై జరిగిన ఉగ్రవాద దాడికి, ఇరాన్‌పై ఇజ్రాయిల్ చేసిన అకారణ దాడికి మధ్య ఏదైనా తేడా ఉందా? అని ప్రశ్నించారు. ఈ రెండు సంఘటనలు హింస, విధ్వంసం వ్యాప్తి చేసే అమానవీయ, అకారణ ఉగ్రవాద చర్యలేనని చెప్పారు.

ఇజ్రాయిల్ క్రూరమైన దురాక్రమణ చర్యలపై మోడీ ప్రభుత్వం మౌనంగా ఉందని, ఇది భారతదేశ మానవత్వపు వారసత్వానికి వ్యతిరేకమని చెప్పారు. అదానీ గ్రూప్, ఇజ్రాయిల్ మధ్య ఉన్న కుమ్మక్కును వివరించారు. హైదరాబాద్‌లో తయారు చేసిన డ్రోన్‌లను ఇజ్రాయిల్‌కు సరఫరా చేస్తున్నారని, వీటిని పాలస్తీనా, ఇరాన్‌లోని అమాయక ప్రజలపై ఉపయోగిస్తున్నారని చెప్పారు. ఈ తరహా సైనిక సహకారాన్ని తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 'పాలస్తీనా అరబ్బులకు చెందినది. హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు, ఇతరులు భారతదేశంలో కలిసి నివసిస్తున్నట్లే యూదులు, క్రైస్తవులు అక్కడ శాంతియుతంగా జీవించాలి' అని మహాత్మా గాంధీ చెప్పిన మాటలను బేబి ఉటంకించారు. దీనికి విరుద్ధంగా, నేడు జియోనిస్టులు పాలస్తీనా పిల్లలను కాల్చివేస్తున్నారని, వారిని భవిష్యత్ ఉగ్రవాదులుగా ప్రకటిస్తున్నారని విమర్శించారు. పాలస్తీనా ప్రజల పోరాటం హిందూత్వ శక్తులు చిత్రించాలనుకుంటున్నట్లుగా మతపరమైన లేదా ఇస్లామిక్ యుద్ధం కాదని చెప్పారు. బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా భారత దేశం చేసిన జాతీయపోరాటంతో సమానమైన పోరాటమని అన్నారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయిల్ దాడులపై పూర్తిగా మౌనంగా ఉండటం సిగ్గుచేటు. 'ఇజ్రాయిల్ దురాక్రమణను వెంటనే ఆపాలి. పాలస్తీనాను స్వతంత్ర, సార్వభౌమ దేశంగా గుర్తించాలి' అని భారతదేశంలోని వామపక్ష పార్టీలు నిర్ద్వంద్వంగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, సిపిఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సిజిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్‌ఎస్‌పి నాయకులు సభలో ప్రసంగించి, పాలస్తీనా ప్రజల న్యాయమైన పోరాటానికి తమ మద్దతును ప్రకటించారు. పాలస్తీనా ప్రజలకు తమ దృఢ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ నిరసనలో విద్యార్థులు, యువత, మేధావులు, రచయితలు, కళాకారులతో పాటు వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు

**దేశ వ్యాప్తంగా ఇలా...**

పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో వామపక్షాల ఆధ్వర్యాన పాలస్తీనాకు సంఘీభావంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లెఫ్ట్‌ఫ్రంట్ ఛైర్మన్ బిమన్ బసు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎండి సలీం తదితర వామపక్ష నేతలు పాల్గొన్నారు. త్రిపుర రాజధాని అగర్తలాలో 'యుద్ధం వద్దు, శాంతి కావాలి' అంటూ భారీ ప్రదర్శన చేపట్టారు. రాజస్థాన్‌లోని జైపూర్‌తో పాటు వివిధ జిల్లాల్లో నిరసనలు జరిగాయి. ఒడిశాలోని భువనేశ్వర్‌తో పాటు వివిధ జిల్లాల్లో సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్), ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యాన ప్రదర్శనలు జరిగాయి. బీహార్‌లోని వామపక్షాల ఆధ్వర్యాన ప్రదర్శన జరిగింది. ఉత్తరప్రదేశ్‌లో వామపక్షాలు మానవహారం నిర్వహించాయి. పంజాబ్‌లో సిపిఎం నేతలు, కార్యకర్తలు. జమ్మూకాశ్మీర్‌లోని సిపిఎం ఆధ్వర్యాన జరిగిన ఆందోళనలో కేంద్ర కమిటీ సభ్యులు యూసఫ్ తరిగామి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వివిధ ప్రాంతాల్లో పాలస్తీనా సంఘీభావ కార్యక్రమాలు జరిగాయి.

## పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండించండి

- ప్రజలకు వామపక్ష పార్టీల పిలుపు
- దాడిపై ట్రంప్, మోడీ వైఖరిని ఖండించిన వామపక్షాల నాయకులు

2



విజయవాడలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు , రామకృష్ణ తదితరులు

**ప్రాణాలు తోడేస్తున్న పొగాకు సాగు**

# ముగ్గురు కౌలు రైతుల ఆత్మహత్య



కొండయ్య



గోపాలరావు



ఆదినారాయణ

- పొగాకు, మిర్చి పంటలతో అప్పులపాలు
- పల్నాడు జిల్లాలో విషాదం

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

పల్నాడు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. మిర్చి, పొగాకు పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పులపాలై ముగ్గురు కౌలు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలు మంగళవారం వెలుగు చూశాయి. గిట్టుబాటుధర కోసం రైతాంగం ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించని సంగతి తెలిసిందే. ఇటీవల కేంద్ర మంత్రి జరిపిన పర్యటనలోనూ నిర్దుష్టమైన హామీ ఇవ్వలేదు. మరోవైపు ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని వ్యాపారులు అమలు చేయడం లేదు. ఈ నేపథ్యంలో

కౌలు రైతులు బలవన్మరణానికి పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాదెండ్ల మండలంలోని రామాపురం కాలనీకి చెందిన నస్యం ఆదినారాయణ (45) తనకున్న ఒకటిన్నర ఎకరం సొంత భూమితోపాటు 70 ఎకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఈ ఏడాది 70 ఎకరాల్లో పత్తి, మిర్చి, శనగ, పొగాకు పంటలు వేశారు. పెరిగిన సాగు ఖర్చులు, తగ్గిన దిగుబడులు, ధరల పతనంతో తీవ్రంగా నష్టపోయారు. పంటల సాగు నిమిత్తం సుమారు రూ.50 లక్షల వరకు అప్పులు చేశారు. అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపంతో సోమవారం రాత్రి సమీపంలోని పొలాల్లో పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. మంగళవారం తెల్లవారుజామున స్థానికులు మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మతుడికి భార్య రమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నాదెండ్ల మండలంలోని తూబాడుకు చెందిన సిరిబోయిన గోపాలరావు (43) వ్యవసాయ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రతి ఏటా తనకున్న 30 సెంట్ల పొలంతోపాటు మరో 15 ఎకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఈ ఏడాది ఐదెకరాల్లో మిర్చి, పదెకరాల్లో పొగాకు సాగు చేశారు. చీడపీడల కారణంగా మిర్చి దిగుబడి రాక నష్టపోయాడు. పొగాకు సాగులో దిగుబడి బాగున్నా ధరలు లేకపోవడంతో ఇంటి సమీపంలోనే పంటను భద్రపరిచారు. పంటల సాగులో సుమారు రూ.20 లక్షల వరకూ నష్టపోయారు. రుణదాతల నుంచి వేధింపులు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో గోపాలరావుకు చెందిన ట్రాక్టరును పురుగుమందుల వ్యాపారి దౌర్జన్యంగా తీసుకెళ్లారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన గోపాలరావు సోమవారం రాత్రి సమీపంలోని పొలాల్లో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడికి భార్య భవానీ, కుమారులు వెంకటేష్, గంగాధర్ ఉన్నారు.

ఈపూరు మండలం కొచ్చర్ల గ్రామానికి చెందిన బండి కొండయ్య (52) ఆరు ఎకరాలను కౌలుకు తీసుకొని మిర్చి, పొగాకు, వరి పంటలను సాగు చేశారు. పంటల సాగునిమిత్తం అప్పులు చేశారు. పంటలు దిగుబడి సరిగా రాకపోవడం, పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపం చెందారు. గ్రామానికి సమీపంలోని పొలాల్లో చెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుమారుడు బండి శివప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్



ఇజ్రాయిల్ డ్రోన్ దాడులతో తగలబడుతున్న ఇరాన్ కంగన్‌లోని సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్

# ఇరాన్ ప్రజలకు ట్రంప్ బెదిరింపులు

**• టెహ్రాన్ ఖాళీ చేయాలని హెచ్చరిక • జి-7నుండి హుటాహుటిన అమెరికాకు**

- సద్దాం హుస్సేన్‌ను గుర్తు తెచ్చుకోవాలన్న ఇజ్రాయిల్
- ఐరన్‌డోమ్ చిల్లుపడటంతో ప్రత్యామ్నాయ వ్యవస్థ
- ఉధృతంగా సాగుతున్న దాడులు

**వాషింగ్టన్ :** ఇరాన్ ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్, అమెరికాలు బెదిరింపులకు దిగుతున్నాయి. ఇజ్రాయిల్ దాడులు ఒకవైపు కొనసాగుతుండగానే, ఆ దేశంతో పాటు, అమెరికా కూడా ఇరాన్ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నించింది. జి-7 సదస్సుకోసం కెనడాకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒకరోజు ముందుగానే తన పర్యటనను ముగించుకుని హుటాహుటిన వాషింగ్టన్‌కు బయలుదేరారు. తిరుగు ప్రయాణానికి ముందు ఆయన ' ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో నివసించే ప్రజలు అక్కడి నుండి ఖాళీ చేయాలి' అని వ్యాఖ్యానించారు. మరోవైపు 'మధ్యప్రాచ్యంలో పరిణామాల దృష్ట్యా ప్రపంచ నేతల సమావేశం నుండి ట్రంప్ అత్యవసరంగా బయలుదేరారు'అని శ్వేతసౌధం పేర్కొంది. అధ్యక్ష భవనంలోని సిట్యుయేషన్ గదిని సిద్ధంగా ఉంచాలని, జాతీయ భద్రతా బృందం అక్కడకు చేరుకోవాలని కెనడా నుండే ఆయన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అమెరికా ప్రత్యక్ష చర్యకు దిగే అవకాశం ఉందంటూ వార్తలు వచ్చాయి. తిరుగు ప్రయాణంలో 'ఎయిర్‌ఫోర్స్ వన్' (అమెరికా అధ్యక్షుని విమానం) లో విలేకరులతో మాట్లాడిన ఆయన తాను ఇజ్రాయిల్, ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ కోరుకోవడం లేదని, నిజమైన ముగింపు లభించాలని ఆశిస్తున్నానని అన్నారు. 'కెనడా నుంచి నేను వాషింగ్టన్‌కు తిరిగి రావడానికి, కాల్పుల విరమణకు ఏమీ సంబంధం లేదు. దాని కంటే పెద్ద పనే ఉంది. వేచి చూడండి' అని ట్రంప్ విలేకరులతో వ్యాఖ్యానించారుఈ వ్యాఖ్యలు కూడా అమెరికా ప్రత్యక్ష జోక్యంపై ఊహాగానాలను పెంచాయి. మరోవైపు ఇజ్రాయిల్ కూడా 'ఇరాక్ అధ్యక్షుడు సద్ధాం హుస్సేన్‌కు ఏం జరిగిందో ఇరాన్ పాలకులు గుర్తు తెచ్చుకోవాలంటూ బెదిరింపులకు దిగింది. మరోవైపు ఇజ్రాయిల్ మంగళవారం నాడుకూడా ఇరాన్‌పై దాడులు కొనసాగించింది. ఈ దాడుల్లో ఇరాన్‌లోని పలు మౌలికవసతులు దెబ్బతిన్నాయి. సాధారణ ప్రజలు కొందరు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వచ్చాయి. దీనికి ప్రతిగా ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల్లో ఇజ్రాయిల్ మిలటరీ ఇంటలిజెన్స్ (మోస్సాద్) కేంద్ర కార్యాలయం తీవ్రంగా దెబ్బతింది. మొస్సాద్ కార్యాలయంపై క్షిపణుల వర్షం కురిసినట్లు స్థానిక మీడియా పేర్కొంది. క్షిపణుల దాడుల నుండి రక్షణకోసం ఏర్పాటు చేసుకున్న ఐరన్‌డోమ్ ఇరాన్ డోమ్ విఫలం కావడంతో ప్రత్యామ్నాయంగా ఆధునిక రక్షణ వ్యవస్థ మెరుపు కవచం (లైటెనింగ్ షీల్డ్)ను రంగంలోకి దింపింది.

**దౌత్యమే ఉత్తమం : ఇయు**

ప్రస్తుత పరిస్థితుల్లో దౌత్యమే ఉత్తమ మార్గమని యురోపియన్ యూనియన్ మంగళవారం వ్యాఖ్యానించింది. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలు చెలరేగిన నేపథ్యంలో 27 దేశాల విదేశాంగ మంత్రులు సమావేశమై అత్యవసర చర్చలు జరిపారు. అనంతరం ఇయు విదేశాంగ విధాన చీఫ్ కజా కల్లాస్ మాట్లాడుతూ, ఉద్రిక్తతలు పెచ్చరిల్లకుండా చూడాల్సిన అవసరం వుందని చెప్పారు.

**అగ్నికి ఆజ్యం పోస్తున్న ట్రంప్ : చైనా**

ఇరాన్‌పై ఇజ్రాయిల్ తీసుకుంటున్న మిలటరీ చర్యల పట్ల చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆకస్మికంగా ఇజ్రాయిల్ జరిపిన దాడులతో ఒక్కసారిగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెచ్చరిల్లాయన్నారు. కజకస్తాన్‌లో ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడితో భేటీ సందర్భంగా జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాల సార్వభౌమాధికారం, భద్రత, ప్రాదేశిక సమగ్రతలను దెబ్బతీసే ఏ చర్యనైనా చైనా వ్యతిరేకిస్తుందని తెలిపారు.

**టెహ్రాన్‌ను వీడిన భారత్ పౌరులు**

బాంబుదాడులు ముమ్మరమైన వేళ టెహరాన్ నుండి భారత పౌరులను స్వంత వాహనాల్లోనే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా అక్కడి భారత ఎంబసీ సూచించింది. ఆ మేరకు ఇప్పటికే 110మంది భారత పౌరులు టెహరాన్‌ను వీడి ఆర్మేనియా వెళ్లినట్లు తెలుస్తోంది.

## రెండు నెలల్లో సర్క్యులర్ ఎకానమీ పాలసీ

**• అక్టోబర్ 2 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం : సిఎం చంద్రబాబు**

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**



రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మెరుగుపరిచేలా రెండు నెలల్లో సర్క్యులర్ ఎకానమీకి సంబంధించి తుది పాలసీని తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన వ్యర్థాల నుండి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆ మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెత్తనుండి విద్యుత్‌ను తయారుచేసే ప్లాంట్లలో ఆధునిక యంత్రాల వినియోగాన్ని పెంచాలన్నారు. రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలనీ, రీసైక్లింగ్ చేయడంపై 90 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలని తెలిపారు. మొదటిదశగా విశాఖపట్నంలో 400 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఎకానమీ పార్కును అంతర్జాతీ యస్థాయిలో నిర్మించాలని, దీనికోసం వివిధ దేశాల్లో పార్కులను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటితో భారీగా పెట్టుబడులు వచ్చేలా చూడాలని చెప్పారు.

**11 రంగాలు 13 అంశాలపై దృష్టి**

సర్క్యులర్ ఎకానమీ కింద కేంద్ర ప్రభుత్వం గుర్తించిన మున్సిపల్, వాహనాలు, లిథియం బ్యాటరీలు, జిప్సం, టైర్లు, రబ్బర్, ఎలక్ట్రానిక్, వ్యవసాయం, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాలు వంటి 11 రంగాలపై దృష్టి పెట్టడంతో పాటు అదనంగా గనులు, చేనేత, పశుసంవర్థకశాఖలతో కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. నగర పాలక సంస్థలు, పంచాయతీల్లో జీరో వేస్ట్ లక్ష్యసాధనకు కృషిచేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. వ్యర్థాల నిర్వహణలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన వాళ్లకు ప్రోత్సాహకంగా స్వచ్ఛత మిగతా 5లో

## పోలీసుల అదుపులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

**ప్రజాశక్తి - రామచంద్రాపురం**



మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని బెంగళూరు ఎయిర్ పోర్టులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైసిపి హయాంలో జరిగిన మద్యం కుంభకోణం ముడుపుల రవాణాలో భాస్కర్‌రెడ్డికి సంబంధం ఉన్నట్లు సిట్ అధికారులు లుకౌట్ నోటీసులను జారీ చేసిన విషయం తెలిసింది. కొలంబోకు వెళ్లేందుకు బెంగళూరు ఎయిర్ పోర్టుకు చేరుకున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడులను ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారు. తిరుపతి సిట్ పోలీసులు బెంగళూరు చేరుకుని, నేరుగా విమానంలో విజయవాడకు చెవిరెడ్డిని తరలించారు. విజయవాడ సిట్ ప్రధాన కార్యాలయంలో చెవిరెడ్డిని విచారించి అనంతరం అరెస్టు చూపనున్నట్లు తెలుస్తోంది.

'లిక్కర్ కేసులో తాము చెప్పినట్లు రాసి సంతకం చేయాలని సిట్ అధికారులు ఒత్తిడి చేశారని, చెవిరెడ్డికి కేసుతో సంబంధం ఉందని చెప్పమన్నారని, తప్పుడు మిగతా5లో

# విశాఖ వేదికగా.. డైవర్షన్ యోగా

- 21న యోగాంధ్ర పేరిట గిన్నిస్ బుక్ స్థానం కోసం విన్యాసాలు
- భారీ జన సమీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- పనుల నిర్వహణకు జివిఎంసి, ఇతర శాఖల నుంచి ఏడు వేల మంది కార్మికులు
- విశాఖ ఏజెన్సీ నుంచి విద్యార్థులను తరలించే ప్రణాళిక
- ప్రభుత్వ ఉద్యోగులపై విపరీత ఒత్తిడి

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

ప్రస్తుతం విశాఖ అంతటా యోగా విన్యాసాలే కనిపిస్తున్నాయి. అధికారులంతా వారి అసలు పనులు పక్కనపెట్టి ప్రభుత్వ ఒత్తిడితో యోగా చుట్టూనే తిరుగుతున్నారు. ప్రజలను సమస్యలను పరిష్కారం కావడం లేదు. గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించడమే లక్ష్యంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైన క్రమంలో విశాఖ తీరం యోగాసనాలకు కేంద్రంగా మారింది. ఈ నెల 21న సుమారు ఐదు లక్షల మందిని విశాఖలో యోగా వేడుకలకు తరలించే యత్నాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైంది. ప్రస్తుతం సాగర తీరమంతా యోగా నిర్వహణ పనులతో కిటకిటలాడుతోంది.



ఉద్యోగాలు కల్పించాలని విశాఖలో యోగాసనాలతో ఆందోళన చేస్తున్న యువత (వార్త 3లో)

ఈ యోగాంధ్ర విజయవంతానికి ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి జనాలను తరలించే బాధ్యతను ప్రధానంగా విశాఖపట్నం జిల్లా విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖకు అప్పగించారు. దీంతో ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురౌతున్నారు.

యోగా వేడుకల సన్నద్ధ కార్యక్రమాలు అంటూ విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను సైతం సోమవారం రద్దు చేశారు. 21న యోగా వేడుకలకు ఏజెన్సీలోని పాఠశాలలు, హాస్టళ్ల నుంచి సుమారు 10 వేల మంది బాలబాలికలను ఈ నెల 20వ తేదీ రాత్రికే తరలించేందుకు విద్యా, వైద్య శాఖలు మిగతా 5లో

## మహిళపై దాడి కేసులో నలుగురు అరెస్టు

**ప్రజాశక్తి- కుప్పం రూరల్**

తమకు బాకీపడ్డ సొమ్ము చెల్లించలేదంటూ చిత్తూరు జిల్లా కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో మహిళను చెట్టుకు కట్టేసి దాడి చేసిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ దారుణ ఘటనకు సంబంధించి మునెప్ప, రాజా, వెంకటమ్మ, జగదీశ్వరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు డిఎస్‌పి పార్థసారథి తెలిపారు. నిందితులను రిమాండ్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడి వెనుక రాజకీయ కోణమేదీ లేదని ఆయన చెప్పారు. ఈ దారుణ ఘటనపై రాష్ట్ర మంత్రివర్గం, ప్రజాప్రతినిధులు స్పందించారు.

కుప్పం ఎమ్మెల్యే, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా ఎస్‌పితో ఫోన్లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మహిళపై జరిగిన దాడిని ఖండించారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బాధిత మహిళకు రక్షణ కల్పించాలని, దుండగులను కఠినంగా శిక్షించాలని సిపిఎం, ఐద్వా, వ్యవసాయకార్మిక సంఘం డిమాండ్ చేశాయి.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిజిటల్ యుగంలో ఇంటర్నెట్ వినియోగం విస్తృతంగా పెరుగుతున్న కొద్ది సైబర్ నేరాలు కూడా వేగంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరస్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. వ్యక్తిగత సమాచారం, సోషల్ మీడియా ఖాతాలు, బ్యాంకింగ్ వివరాలపై సైబర్ దాడులు జరగడమనేది సర్వసాధారణంగా మారిపోయిందన్నారు. ఈ మేరకు మంగళవారం డిజిపి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. యూజర్ తెలియకుండా ఎపికె (ఆండ్రాయిడ్ ప్యాకేజీ) ఫైల్స్‌ను క్లిక్ చేసిన వెంటనే ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ డిటైల్స్, పాస్‌వర్డ్, కాంటాక్ట్స్, మెసేజ్‌లు, గ్యాలరీ ఫైల్స్ వంటి వ్యక్తిగత డేటా హ్యాకర్ల చేతిలోకి వెళతాయన్నారు. వాళ్లు ఒకే ఒక క్లిక్‌తో ఖాతాలో ఉన్న డబ్బు మొత్తాన్ని ఖాళీ చేయడంతో పాటు మొబైల్‌లోని ఉన్న వ్యక్తిగత సమాచారం ఆధారంగా బ్లాక్‌మెయిలింగ్‌లకు దిగుతారని తెలిపారు. ఇటీవల సత్యసాయి జిల్లా, కనిగానిపల్లి ప్రాంతానికి చెందిన ఓ రైతు వాట్సాప్‌కు కేంద్ర ప్రభుత్వ పథకమైన పిఎం కిసాన్ యోజన పేరుతో నకిలీ ఎపికె ఫైలు రాగా ఆ రైతు దానిని అధికారిక యాప్‌గా భావించి డౌన్‌లోడ్ చేయడంతో ఆ రైతు ఎస్‌బిఐ ఖాతా నుంచి రూ.94 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రమాదకర ఎపికె ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవద్దని డిజిపి సూచించారు. ప్రతిఒక్కరూ సైబర్ భద్రతపై అవగాహన కలిగి ఉండటంతోపాటు అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయకుండా ఉండటం, అపరచితుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌కు స్పందించకుండా ఉండటం మంచిదన్నారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,**
**ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,**
**అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,**
**గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
**editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## గోదావరి వృథా జలాలే బనకచర్లకు

- మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గోదావరిలో వృథా జలాలను మాత్రమే బనకచర్లకు మళ్లించుకుంటున్నామని, పై రాష్ట్రాల అవసరాలు తీరిన తరువాతే ఎపికి జలాలు వస్తాయని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టుపై మంగళవారం వెలగపూడి సచివాలయంలో ఆయన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. గోదావరి చివరన ఎపి ఉందని, సముద్రంలో 3000 టిఎంసిలు కలుస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో వాటిలో కొంత భాగాన్ని వినియోగించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. దీనివల్ల ఎగువ రాష్ట్రాలకు ఎటువంటి నష్టమూ లేదని తెలిపారు. నీటి సదుపాయం లేని రాయలసీమ ప్రాంతానికి నీటిని తరలించాలనే ఉద్దేశంతో బనకచర్ల ప్రాజెక్టు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. గోదావరికి వచ్చే వరదల వల్ల నష్టపోతోంది కూడా రాష్ట్రమేనన్నారు. ఈ నేపథ్యంలో మిగులు జలాల వినియోగంపై రాష్ట్రానికి సర్వహక్కులూ ఉన్నాయని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన బనకచర్లపై తెలంగాణ అభ్యంతరం పెట్టాల్సిన అవసరం ఏమిటో తెలియడం లేదన్నారు. ఈ ప్రాజెక్టుపై రాయలసీమ ప్రాంతానికి చెందిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభ్యంతరం చెప్పడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. దీనివల్ల ఎవరికీ 1.1 శాతం కూడా నష్టం లేదని పేర్కొన్నారు. వాస్తవాలు తెలంగాణ ప్రజలకు తెలుసని, సముద్రంలో కలిసే జలాలను వాడుకుంటే ఇబ్బంది ఏమిటో వారే సమాధానం చెప్పాలన్నారు. అది రాజకీయ పరమైన సమస్యలే తప్ప వాస్తవం కాదని తెలిపారు. తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎటువంటి అనుమతులూ లేవన్నారు. అక్కడ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై మాట్లాడుతున్నారని అన్నారు.

# మోడీ పాలనలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వానికి ఎమర్జెన్సీని మించిన ప్రమాదం

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు
- పహల్గాం ఉగ్రదాడి, అనంతర పరిణామాలపై ప్రజలకు వాస్తవాలు చెప్పాలి
- అమెరికా విదేశాంగ విధానానికి అనుగుణంగా కేంద్రం చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న బివి.రాఘవులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధాని మోడీ పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వానికి ఎమర్జెన్సీకి మించిన ప్రమాదం వచ్చిందని, దీన్ని ఐక్యంగా ఎదుర్కోవాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. మంగళవారం విజయవాడలోని ఎంబివికెలో జరిగిన విలేకరుల సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యులు యు.వాసుకి, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల కేంద్ర కమిటీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ఈ సందర్భంగా వివరించారు. ఎమర్జెన్సీ ప్రమాదాన్ని ప్రజలకు వివరించాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి, అనంతర పరిణామాలపై ప్రజలకు వాస్తవాలు తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇటీవల జమ్మూకాశ్మీర్లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి సంబంధించిన వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉగ్రవాదులు అమాయక ప్రజలను పొట్టనబెట్టుకున్నారని, దీనికి ప్రతిగా భారతదేశం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిందని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య కాల్పులు మొదలయ్యాయని, దీన్ని తానే విరమింపజేసినట్లు ట్రంప్ ప్రకటన చేశారని, దీనిపై ప్రత్యేక పార్లమెంటు ఏర్పాటు చేసి వాస్తవాలు బయటపెట్టాలని కోరితే కేంద్రం అంగీకరించడం లేదని అన్నారు. ఈ విషయంలో కేంద్రం ఏదో దాస్తోందని, ప్రజలకు అబద్ధాలు చెబుతోందని సిపిఎం అభిప్రాయ పడుతోందని చెప్పారు. ఉగ్రవాదులను అణచడానికి, ఉగ్రవాదాన్ని నాశనం చేయడానికి యుద్ధం పరిష్కారం కాదని సిపిఎం చెబుతూ వస్తోందని, అంతర్జాతీయ ఒత్తిడి ద్వారా, సెక్యూరిటీని బలపర్చుకోవడం, ప్రజల మద్ధతును కూడగట్టడం ద్వారా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఆ పని చేయకుండా మోడీ ఆయన బృందం యుద్ధోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని అన్నారు. అఖిలపక్షం ఏర్పాటు చేసి దానికి ప్రధాని రాకుండా మంత్రులను పంపించారని, మోడీ ఎందుకు హాజరు కాలేదో ప్రజలకు చెప్పాలన్నారు. అమెరికా విదేశాంగ విధానానికి అనుకూలంగా కేంద్రం వ్యవహరిస్తూ ట్రంప్‌కు దాసోహం అయిందని విమర్శించారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులను ప్రస్తావిస్తూ, దాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం ఖండించడం లేదని పేర్కొన్నారు. ఇరాన్‌తో మనకు స్నేహపూర్వక ఆర్థిక సంబంధాలున్నాయని, యుద్ధం జరిగితే క్రూడ్ అయిల్ ధరలు పెరిగి మన ఆర్థిక వ్యవస్థకు నష్టం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే క్రూడ్ అయిల్ ధరలు పదిశాతం పెరిగాయని పేర్కొన్నారు. కేంద్రం మరోవైపు దీనిపై ప్రకటన చేసిన ట్రంప్ గతంలో పాకిస్తాన్, ఇండియా యుద్ధాన్ని తానే ఆపానని చెప్పారని, అయినా కేంద్రం నోరెత్తడం లేదన్నారు. ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకొచ్చి యుద్ధాన్ని ఆపాల్సిన అవసరం ఉందని తెలిపారు. బిజెపి ఆధ్వర్యంలో ఉన్న కేంద్రం ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఉందని, ఆ ఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. దాడి చేసినవారిని, దాడికి గురువుతున్న వారినీ ఒకేగాటన కట్టే ప్రయత్నం భారత ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. ఇది, అమెరికాకు ఇబ్బంది లేకుండా ట్రంప్‌కు ఇష్టపూర్వకంగా వ్యవహరించేలా ఉందని చెప్పారు. విశ్వగురు అని చెప్పుకుంటూ ట్రంప్‌కు తొత్తుగా కేంద్రం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఇరాన్‌లో ఒడరేవు మనం నిర్మిస్తున్నామని, క్రూడ్ అయిల్ అక్కడ నుండి తెచ్చుకుంటున్నామని, ఈ దశలో ఇజ్రాయిల్ దురాగతాలను ఖండించాల్సిందిపోయి అనుకూలంగా వ్యవహరించడం సబబు కాదని, . ఇజ్రాయిల్‌తో సంబంధాలు తెగదెంపులు చేసుకోవాలని ఆయన డిమాండు చేశారు.

**ఎమర్జెన్సీ ప్రమాదాన్ని ప్రజలకు చెప్పాలి**

జూన్ 25 నాటికి ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తవుతాయని, ఆ ప్రమదాన్ని ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉందని రాఘవులు తెలిపారు. అప్పట్లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా సిపిఎం పోరాడిందని వివరించారు. ప్రతిపక్ష పార్టీలూ కలిసి పోరాడాయని, ఎమర్జెన్సీ వల్ల ప్రజాస్వామ్యానికి, రాజకీయ వ్యవస్థకు ఎంత హాని జరిగిందో ప్రజలు ఎంత ఇబ్బంది పడ్డారో జ్ఞాపకం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రస్తుతం మోడీ అంతకంటే ప్రమాదకరంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఆరోజు ప్రజలందరూ కలిసి ఎమర్జెన్సీ నుండి దేశాన్ని ఎలా రక్షించుకున్నారో ఈరోజు నయా ఫాసిస్టు ధోరణుల శక్తుల ప్రమాదం నుండి లౌకికవాదం, ప్రజాస్వామ్యం, ఫెడరలిజాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సిపిఎం నిర్ణయించిందని తెలిపారు. దీనికోసం ప్రజల కర్తవ్యాన్ని, ప్రతిపక్షాలు ఐక్యంగా కృషి చేయాల్సిన కర్తవ్యాన్ని ప్రజల ముందు ఉంచాలని అనుకున్నామని తెలిపారు.

## అమరావతిలో 2 ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజధాని అమరావతిలో రెండు ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ వ్యయ విభాగ కార్యదర్శి పార్థ్ పాల్ రెండు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నగరం అమరావతిలో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్, జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ (జిపిఆర్ఎ) నిర్మాణం సిపిడబ్ల్యుడి చేత నిర్వహించబడుతుందని, దీనికి సంబంధించి సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్లు అందులో పేర్కొన్నారు. గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2025 మే 22న, 2025 జూన్ 11న సమర్పించిన ప్రతిపాదనకు సూత్రప్రాయ ఆమోదం మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఈ అంశంపై కాన్సెప్ట్ నోట్, వివరణలను పంపాలని కోరినట్లు తెలిపారు. ఆర్థికశాఖ వ్యయ విభాగ ప్రతిపాదనను పరిశీలించిన తరువాత సిపిడబ్ల్యుడి చేపట్టనున్న అమరావతిలో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్, జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ (జిపిఆర్ఎ) నిర్మాణ ప్రతిపాదనకు 'సూత్రప్రాయంగా' ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ప్రాజెక్ట్ అంచనా వ్యయాన్ని పిఐబి సమావేశంలో అంచనా వేస్తారని పేర్కొన్నారు. అయితే ఈ రెండు ప్రాజెక్టులు రూ.2,787 కోట్లతో నిర్మించనున్నారు. రూ.1,329 కోట్లతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు క్వార్టర్స్ నిర్మాణం, అదేవిధంగా రూ.1,458 కోట్లతో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం చేపట్టనుంది. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ రెండు ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థికశాఖ ఆమోద ముద్ర వేసిందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఎక్స్‌లో తెలిపారు.

## యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

- గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. రాజ్‌భవన్‌లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు, సిబ్బంది మంగళవారం యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగా భారతదేశం.. ప్రపంచానికి ఇచ్చిన బహుమతి అని, ఇది 5 వేల ఏళ్ల కిందట రూపొందించిన విధానమన్నారు.

# పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండించండి

- ప్రజలకు వామపక్ష పార్టీల పిలుపు
- దాడిపై ట్రంప్, మోడీ వైఖరిని ఖండించిన వామపక్ష పార్టీల నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని, పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలపాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ట్రంప్ సామ్రాజ్య వాదానికి మద్దత్తునిస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని కోరాయి. విజయవాడలోని ధర్నా చౌక్‌లో పాలస్తీనా సంఘీభావ సమావేశాన్ని మంగళవారం నిర్వహించాయి. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇజ్రాయిల్ దురాగతాలను అమెరికా అధ్యక్షులు ట్రంప్, దేశ ప్రధాని మోడీ బలపరుస్తున్న తీరు దారుణమన్నారు. సొంత గడ్డపైనే నిర్వాసితులుగా పాలస్తీనా ప్రజలు జీవిస్తున్నారని తెలిపారు. పాలస్తీనా సమస్యకు మతం, కులం లేదన్నారు. ఇజ్రాయిల్ దురాగతాలకు, ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు చెప్పారు. పాలస్తీనా స్వాతంత్ర్యోద్యమం మన దేశ స్వాతంత్ర్య పోరాటం కంటే ముందే ప్రారంభమైందన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయం నుంచి ఇజ్రాయిల్.. పాలస్తీనా గడ్డపైనే అక్కడి వాళ్లను నిర్వాసితులుగా చేసి దుర్మార్గానికి పాల్పడిందని చెప్పారు. పాలస్తీనాతో మన దేశానికి ఎప్పటి నుంచో సత్సంబంధాలు ఉన్నాయని, ఢిల్లీలో పాలస్తీనా రాయభార కార్యాలయం కూడా ఉందన్నారు. ఇప్పుడు ఆ సంప్రదాయాలకు భిన్నంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. సామ్రాజ్యవాదానికి మోడీ ప్రభుత్వం లొంగుబాటుకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. ఇజ్రాయిల్ దురాగతాలకు వెన్నుదన్నుగా నిలిచింది అమెరికా అధ్యక్షులు ట్రంప్ అని అన్నారు. ఇజ్రాయిల్ మొన్నటి వరకూ పాలస్తీనాపై దాడి చేసిందని, తాజాగా ఇరాన్‌పై దాడులు ప్రారంభించిందన్నారు. అమెరికా అండతోనే ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో రెచ్చిపోతుందని తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచే భారతదేశం.. పాలస్తీనాకు అండగా నిలిచిందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని, మోడీ విదేశీ విధానంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ఆపడానికి కారణమేమిటని ప్రశ్నిస్తే సమాధానం లేదన్నారు. పాలస్తీనాకు సంఘీభావంగా నిలవాలని ప్రజలకు సూచించారు. సిపిఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) రాష్ట్ర అధికార ప్రతినిధి పి ప్రసాద్ మాట్లాడుతూ.. ఇజ్రాయిల్ తీరును ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఇజ్రాయిల్ దాడి కారణంగా పాలస్తీనాలో వేలాది మందికి తిండిలేని పరిస్థితి నెలకొందన్నారు. సిపిఐ ఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్ మాట్లాడుతూ.. ఇజ్రాయిల్ వ్యవహరిస్తున్న తీరుపై దేశ వైఖరి స్పష్టం చేయడంలో మోడీ ప్రభుత్వం తీరును తప్పుబట్టారు. ఎస్‌యుసిఐ నాయకులు అమర్‌నాథ్ మాట్లాడుతూ.. పాలస్తీనాపై దాడికి సోషల్ మీడియాలో మతం రంగుపులిమి తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దొనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ.. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిలో అమెరికా వ్యవహరిస్తున్న తీరు జుగుప్సాకరంగా ఉందన్నారు. సిపిఐ కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) నాయకులు కిరణ్, వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



విశాఖలో నిరసన ప్రదర్శన చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

**రాష్ట్రవ్యాప్తంగా భారీ ప్రదర్శనలు**

పాలస్తీనా, ఇరాన్‌లపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యాన మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. 'యుద్ధం వద్దు, అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి, పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ ఊచకోతలను ఖండించాలి' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతపురం టవర్ క్లాక్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. విశాఖలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ గురజాడ విగ్రహం జంక్షన్ నుంచి ఆశీలమెట్ట మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యన్నారాయణమూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు. అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన పాలస్తీనా సంఘీభావ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆజాద్ చౌక్ వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఇజ్రాయిల్ మారణకాండను ఆపాలంటూ నినదించారు. కాకినాడ జిల్లా కాజులూరు, కాకినాడలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు. విజయనగరం జిల్లా బొబ్బిలి కోరాడ వీధి సెంటర్లలో, కర్నూలులో గడియారం హాస్పిటల్ ఎదుట సిఐటియు ఆధ్వర్యాన పాలస్తీనా సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని పద్మావతి నగర్ సెంటర్‌లో సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని అంబేద్కర్ సెంటర్లో సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం, పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా మానవహారం నిర్వహించారు. పెదకాకాని, తాడేపల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల పార్టీల నాయకులు ఆందోళన, పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని బ్యాంక్ కాలనీలో ధర్నా చేపట్టారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి, రేణిగుంట, గూడూరుల్లో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలు జరిగాయి.

# సముద్ర తీరం కబ్జా!

- సీమౌత్ మూసివేతపై మత్స్యకారుల ఆగ్రహం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలోని చీరాల-బాపట్ల సరిహద్దులోని సముద్ర తీరాన్ని రియల్టర్‌లు, రిసార్టుల యజమానులు చదును చేస్తుండడంతో స్థానిక మత్స్యకారులు అడ్డుకున్నారు. సముద్ర అలలు దాటి లోపలి వరకు తమకు చెందిన పట్టా భూమి ఉందంటూ తీర ప్రాంతాన్ని చదును చేసేందుకు రియల్టర్ మంగళవారం జెసిబిలను తీసుకువచ్చారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని మత్స్యకారులు నిరసన తెలుపుతూ యంత్రాలను అడ్డుకున్నారు. దీంతో రియల్టర్‌లు పనులను నిలుపుదల చేసి తమ వాహనాలను వెనక్కితీసుకువెళ్లారు. బాపట్ల నుంచి చినగంజాం వరకు రిసార్టుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చీరాల, బాపట్ల మండలాల మధ్య ఉన్న ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కేంద్రంగా చాలా కాలంగా వివాదం నడుస్తోంది. చీరాల ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు సముద్రంలో కలిసే విధంగా గతంలో కాలువ నిర్మించారు. తుపాను సమయాల్లో ఈ కాలువలోకి బోట్లను సముద్రంలో నుంచి తీసుకువచ్చి మత్స్యకారులు సురక్షితంగా ఉంచుకుంటారు. రిసార్టు నిర్మాణాలకు పూనుకున్న రియల్ ఎస్టేట్ వారు సీ మౌత్ (సముద్ర ముఖద్వారం)ను మూసివేసి విశాలమైన కాలువను కుదించారు. దీంతో పాటు అక్కడ తీరంలో ఉన్న ఇసుక దిబ్బలను తొలగించి చదును చేశారు. జెసిబిలు, ట్రాక్టర్లతో పనులు చేపట్టడంతో ఆ పనులను విజయలక్ష్మిపురం మత్స్యకారులు అడ్డుకున్నారు. గత కొన్ని మాసాలుగా గుంటూరుకు చెందిన శ్రీ భ్రమరా ఇన్ఫ్రా సంస్థ సీమౌత్ పూర్తిగా ధ్వంసం చేసి కొండరాళ్లతో నీటి ప్రవాహ దిశను మళ్లించేందుకు నిబంధనలను తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈమేరకు మత్స్యకారులు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సంఘటన స్థలానికి వెళ్లి క్షేత్రస్థాయి నివేదిక ఇవ్వాలని బాపట్ల ఆర్‌డిఒ పి.గ్లోరియాని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆందోళన స్థలికి ఆర్‌డిఒ చేరుకుని పనులను పరిశీలించారు. ఈపురుపాలెం స్టయిట్‌కట్, సీమౌత్ వాస్తవ పరిస్థితి విషయమై డ్రయినేజీ అధికారులతో కలిసి సర్వే చేసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే సీమౌత్‌ను పునరుద్దరిస్తామని మత్స్యకారులకు ఆర్‌డిఒ హామీ ఇచ్చారు..


తీరంలో ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

## మహిళపై దాడి ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలకు సిఎం ఆదేశం

- బాధితురాలికి పరామర్శ
- రూ.5 లక్షల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చిత్తూరు జిల్లా, కుప్పం మండలం, నారాయణపురంలో తీసుకున్న అప్పు చెల్లించలేదని మహిళను చెట్టుకు కట్టేసి అమానవీయ ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సంఘటనపై జిల్లా ఎస్పితో సిఎం మంగళవారం మాట్లాడారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. తిమ్మరాయప్ప అనే వ్యక్తి మునికన్నప్ప వద్ద కొంత మొత్తం అప్పుగా తీసుకోగా, కొంత కాలం అనంతరం అప్పుల భారం భరించలేక తిమ్మరాయప్ప గ్రామం వదిలి వెళ్లిపోయిన నేపథ్యంలో.. మునికన్నప్ప, ఆయన కుటుంబ సభ్యులు తిమ్మరాయప్ప భార్యతో అప్పు చెల్లించాలని గొడవపడి ఆమెను చెట్టుకు కట్టేశారని ఘటన వివరాలను ముఖ్యమంత్రికి ఎస్పి తెలిపారు. నిందితుడిని ఇప్పటికే అరెస్ట్ చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా బాధిత కుటుంబానికి అండగా ఉండాలని జిల్లా అధికారులకు సిఎం సూచించారు. బాధితురాలు శిరీషను ఫోన్‌లో సిఎం పరా మర్శించారు. ఈ సందర్భంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రక టించారు. ముగ్గురు పిల్లల చవుదుకు హామీ ఇచ్చారు. ఈ ఘటనపై స్పందించిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదు : మాజీ సిఎం జగన్**

రాష్ట్రంలో మహిళలకు కూటమి పాలనలో రక్షణ లేదని, సాక్షాత్తూ ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో ఓ మహిళను చెట్టుకు కట్టేసి కొట్టడం దుర్మార్గ పాలన ఫలితమేనని మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ, ఆత్మగౌరవం లేదని పేర్కొన్నారు. చెట్టుకు కట్టేసి మహిళను హింసిస్తున్న ఘటన సిగ్గుపడాల్సిన విషయమని తెలిపారు. తిమ్మరాయప్ప అనే వ్యక్తి అప్పు చెల్లించలేదని, తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్త చెట్టుకు కట్టేసి హింసించారని వివరించారు. ఆమె బిడ్డలు రోధిస్తున్నా కనికరం చూపలేదని, విడిచిపెట్టలేదని విమర్శించారు. చంద్రబాబు ఏడాది పాలనలో జరిగిన అనేక క్రూరమైన ఘటనల్లో ఇదొకటని పేర్కొన్నారు. పొలిటికల్ గవర్నెన్స్, రెడ్‌బుక్ పేరిట నెలకొల్పిన దుష్ట సంప్రదాయంలో భాగంగా టిడిపి నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా చెలరేగిపోయి చేస్తున్న దుర్మార్గాలకు మహిళలు, యువతులు, బాలికలు ఇలా ఎందరో బలైపోతున్నారని అన్నారు. ఈ ఘటనతో పాటు ఏడాదికాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై జరిగిన అన్యాయాలు, అఘాయిత్యాలను సీరియస్‌గా తీసుకోవాలని, చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**దుండగులపై కఠిన చర్యలకు సిపిఎం డిమాండ్**

కుప్పంలో మహిళను చెట్టుకు కట్టేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కమిటీ ఆమోదించిన ప్రకటనను మంగళవారం విడుదల చేశారు. భర్త అప్పు తీర్చలేదని భార్యను తాడుతో కట్టేసి దాడిచేసిన దారుణ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బాధితుల అప్పు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సభ్యసమాజం తలదించుకునేలా ఉన్న ఈ అనాగరిక చర్య చిత్తూరు జిల్లా, కుప్పం మండలం, దాసేగానూరు పంచాయతీ నారాయణపురంలో జరిగిన సంగతి తెలిసిందే. చిన్నపిల్లాడు ఏడుస్తున్నా కనికరించకుండా అమానుషంగా ప్రవర్తించిన సంఘటనపై ప్రభుత్వం స్పందించి నిందితుడు మునికృష్ణప్పపై కఠిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. సిఎం సొంత నియోజకవర్గంలో ఈ సంఘటన జరగడం రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అనాగరిక దాడులకు నిదర్శనమని తెలిపారు. ఇలాంటి ఫ్యూడల్ అణచివేత ఆధునిక కాలంలో కూడా కొనసాగడం ప్రభు త్వానికి సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్రంలో మైక్రోఫైనాన్స్ అప్పులు పెరుగుతున్నాయని అనేక వార్తలొస్తున్నాయని, ఇటీవల బాపట్ల జిల్లా, భట్టిప్రోలు మండలం, వెల్లటూరులో పార్వతీభాయ్ ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. ఫైనాన్స్ కంపెనీలు బలవంతంగా వసూళ్లు చేసుకోవడం కోసం వ్యాపారులు అవమానాలకు గురిచేస్తున్నారని, ఈ వేధింపులకు తాళలేక కొందరు గ్రామాలను వదిలిపెట్టడం, మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వివరించారు. దీనిపై ప్రభుత్వం స్పందించి మైక్రోఫైనాన్స్, వడ్డీ వ్యాపారుల ఆగడాలను అరికట్టడానికి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**శిరీషకు రక్షణ కల్పించి, అప్పును రద్దు చేయాలి : ఐద్వా**

శిరీషను చెట్టుకు కట్టేసి కొట్టడాన్ని ఐద్వా రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనలో నిందితులైన మునిరత్నం, అతని కుమారుడిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని కోరారు. బాధితురాలైన శిరీషకు రక్షణ కల్పించాలని, ఆమె భర్త తీసుకున్న అప్పును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సాధికారత వెలిగిపోతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నాయకులు చెప్పు కుంటున్న గొప్పల డొల్లతనాన్ని ఈ ఘటన మరోసారి వెల్లడిచిందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో భర్తలు వదిలేసిన మహిళలకు రక్షణ లేని స్థితికి ఇది దర్పణమని తెలిపారు.

**'కుప్పం' ఘటనలో నిందితులపై కఠిన చర్యలు**
**వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**

చిత్తూరు జిల్లా, కుప్పం మండలం, నారాయణపురం గ్రామంలో వ్యవసాయ కార్మికులు శిరీషను అప్పు తీర్చలేదని చెట్టుకు కట్టేసి హింసించిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని, శిరీష కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. త్వరలోనే అప్పు చెల్లిస్తామని శిరీష యజమానిని ఎంత వేడుకున్నా వినిపించుకోకుండా నడిరోడ్డుపై ఈడ్చుకుంటూ తీసుకెళ్లి చెట్టుకు కట్టేశారన్నారు. సిఎం చంద్రబాబు సొంత నియోజకవర్గంలో ఇటువంటి దుర్ఘటన జరగడం సభ్య సమాజం తలదించుకోవాల్సి వస్తుందన్నారు. నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, శిరీష కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం, రెండెకరాల భూమి ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆదాయం కోసం కొత్త మార్గాలు : సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ఆదాయం పెంచుకోవడానికి కొత్త మార్గాలను అన్వేషించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఆయన పణాళికాశాఖపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న రాష్ట్ర సొంత ఆదాయవనరులు, కేంద్రం నుండి అందే ఆర్థికసాయాలకు అదనంగా ఈ కొత్త మార్గాలు ఉండాలన్నారు. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో . ఆర్థిక పరిస్థితి, జిఎస్‌డిపి అంచనాలు, అభివృద్ధి సూచికలు, గ్రోత్ డైవర్స్ వంటి అంశాలపై సిఎం చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతానికంటే ఎక్కువగా ప్రణాళికాశాఖకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతిశాఖ మెరుగైన ఫలితాలు రావాలన్నారు. రుణభారం తగ్గించుకోవడం సంక్షేమ పథకాలకు అవసరమైన వనరులు సమకూర్చుకోవడం అత్యంత కీలక అంశాలని పేర్కొన్నారు. పెట్టుబడులు ఆకర్షించే విషయంలో ఎపి బ్రాండ్ ప్రమోషన్ నిరంతరం జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటికే 25 క్యాబినెట్ సమావేశాలరు, ఆరు ఎస్‌ఐపిబి సమావేశాలు నిర్వహించి పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని గుర్తు చేశారు. అంతటితో ఆగకుండా ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చూస్తున్నామని తెలిపారు. తలసరి ఆదాయంలో 2028-29 నాటికి 15 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సిఎం ఆదేశించారు. నెలవారీ అభివృద్ధి సూచికల ద్వారా పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. లోటుపాట్లు ఉంటే సవరించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.


## ఫుడ్ ప్రాసెసింగ్ భవన నిర్మాణాలపై సిఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం : ఎపి ఛాంబర్స్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆహార తయారీ పరిశ్రమలకు సంబంధించిన భవన నిర్మాణాలపై ఛార్జీలను తగ్గించాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఎపి ఛాంబర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి భాస్కరరావు, బి రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఆహార పరిశ్రమలను ప్రోత్సహించడానికి సిఎం నిర్ణయం దోహదపడుతుందని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ భవనాల నిర్మాణ ఫీజులు తగ్గించాలని కోరుతూ ఎపి ఛాంబర్స్ ఆధ్వర్యాన 2025 ఏప్రిల్ నాలుగున పరిశ్రమ విభాగానికి వినతిపత్రం సమర్పించామని వారు తెలిపారు. దీనిలో భవన నిర్మాణ అనుమతి రుసుములు, అభివృద్ధి ఛార్జీలు స్థల అనుమతి, గ్రీన్ ఫీజు వంటి భారాలపై విన్నవించామని పేర్కొన్నారు. వాటిని తగ్గిస్తే ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు అవకాశం ఉంటుందని, బయట కంపెనీలను ఆకర్షించేందుకు వీలవుతుందని తెలిపారు.

# మా బాధలు చూసి న్యాయం చేయండి

- కేంద్ర సాధికారిక కమిటీ వద్ద కొల్లేరు ప్రజల ఆవేదన
- జిరాయితీ, సొసైటీ భూముల ధ్వంసంతో రోడ్డున పడ్డామని కన్నీరు
- కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలి : సిపిఎం, ప్రజా సంఘాలు, గ్రామస్తుల వినతులు


కేంద్ర సాధికారిక కమిటీకి వినతి అందిస్తున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తమ బాధలను చూసి న్యాయం చేయాలని కొల్లేరు గ్రామస్తులతోపాటు వివిధ ప్రజా సంఘాల నేతలు కేంద్ర సాధికారిక కమిటీని కోరారు. కొల్లేరుపై అధ్యయనం చేసేందుకు కేంద్ర సాధికారిక కమిటీ మంగళవారం కొల్లేరు ప్రాంతంలో పర్యటించింది. ఈ కమిటీలో చంద్రప్రకాష్ గోయల్, జెఆర్.భట్, జి.భానుమతి, సునిల్ లిమాయే ఉన్నారు. విజయవాడ నుండి ఏలూరుకు చేరుకున్న ఈ కమిటీ కొల్లేరు ప్రాంత గ్రామాలైన శ్రీపర్రు, కలకుర్రు, పెద్దఎడ్లగాడ, కైకలూరు, ఆటపాక, కొల్లేటి కోట గ్రామాల్లో పర్యటించింది. కమిటీ పర్యటన గురించి తెలిసి కొల్లేరులోని ప్రజలంతా పెద్దఎత్తున రోడ్లపైకి చేరుకున్నారు. కమిటీ సభ్యుల కాళ్లకు దండాలు పెడుతూ తమకు న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. కలకుర్రు గ్రామం లోపలికి వెళ్లి కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలించడంతోపాటు అక్కడ మ్యాప్ పాయింట్ ద్వారా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ జిరాయితీ, సొసైటీ భూములను సైతం ధ్వంసం చేసేశారని, గ్రామాల్లో ఏ ఒక్క అభివృద్ధి పనీ చేయకుండా అడ్డుకుంటున్నారని కమిటీ సభ్యులకు తెలిపారు. పెద్దఎడ్లగాడ వద్ద వంతెన పైనుంచి కొల్లేరు ప్రాంతాన్ని కమిటీ సభ్యులు పరిశీలించారు. ఆటపాక పక్షుల కేంద్రం వద్దకు వెళ్లి అక్కడ కొల్లేరు మ్యాప్‌పాయింట్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కైకలూరు మండలం కొల్లేటి కోటలో ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడారు. కొల్లేరు ప్రజల సమస్యలను వివరించారు. జిరాయితీ, సొసైటీ పట్టాభూములు అప్పగించాలని ప్రజాప్రతినిధులు కోరారు. కొల్లేరు లో ఎన్ఆర్ఇజిఎస్ పనులు చేసుకునేలా అనుమతి ఇవ్వాలన్నారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ తమ పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని, కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి న్యాయం చేయాలని అన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన పెద్దలు, ప్రజాసంఘాల నేతలు మొత్తం 45 వినతులను కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన వినతులన్నింటినీ పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ పర్యటనలో ఫారెస్ట్ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**కొల్లేరు ప్రజలను ఆదుకోవాలి : సిపిఎం**

కొల్లేరు సమస్యను అధ్యయనం చేసేందుకు వచ్చిన కేంద్ర సాధికారిక కమిటీకి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్‌తో కూడిన బృందం కొల్లేటికోట గ్రామంలో వినతిపత్రం అందించింది. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించడంతోపాటు అక్కడి ప్రజలకు ఉపాధి కల్పించి కొల్లేరు ప్రజలను ఆదుకోవాలని కోరింది. గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు ఏఒక్కటీ అమలు కాలేదని అందులో పేర్కొన్నారు. 146 సొసైటీలు పునరుద్ధరించాలని, 14,800 ఎకరాలు జిరాయితీ భూముల హక్కుదార్లకు అప్పగించాలని కోరారు. కొల్లేరుపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి, సుప్రీంకోర్టుకు పంపించాలన్నారు. కొల్లేరులో ఉన్న వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని కోరారు. అటవీశాఖ వేధింపులు, అవినీతిని అరికట్టాలన్నారు. కొల్లేరు గ్రామాలకు రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ఆ ప్రాంత ప్రజలకు అదనంగా ఉపాధి కల్పించాలని కోరారు.





## 'షార్' బెదిరింపు కాల్ యువకుడు అరెస్టు

ప్రజాశక్తి -సూళ్లూరుపేట

శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో అనుమానిత వ్యక్తి ప్రవేశించారంటూ ఆదివారం అర్ధరాత్రి చెన్నై పోలీసులకు ఫోన్ చేసి కలకలం రేపిన వ్యక్తిని సూళ్లూరుపేట పోలీసులు తమిళనాడులో అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాకు చెందిన విజయబాబుగా పోలీసులు గుర్తించారు. విచారణలో అతను మానసిక రోగిగా ఉన్నట్లు సేలం పోలీసులు తెలిపారు. తప్పుడు సమాచారం ఇచ్చిన విజయ బాబు పై కేసు నమోదు చేశారు.

## ఇరాన్‌లో భారతీయులు సురక్షితం

- ఎపిఎన్ఆర్‌టి శాఖ మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇరాన్‌లో భారతీయులు సురక్షితంగా ఉన్నారని ప్రవాసాంధ్రులశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. దీనిపై మంగళవారం మంత్రి ప్రకటన విడుదల చేశారు. ఇరాన్, ఇజ్రాయిల్ దేశాల మధ్య వివాదం చెలరేగినప్పటి నుండి పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని వివరించారు. అక్కడ ఉన్నవారి కోసం భారతీయ ఎంబసీ ద్వారా సహాయక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అవసరమైన సమాచారాన్ని ఎపిఎన్ఆర్‌టి సోషల్ మీడియా ద్వారా అందరికీ చేరవేస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైన వారు వెంటనే ఎన్ఆర్‌టి వెబ్‌సైట్లో వారి వివరాలు నమోదు చేసుకోవాలని, దీనిద్వారా యుద్ధ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని తెలిపారు. అలాగే హెల్ప్‌లైన్ నెంబరును 24 గంటలూ అందుబాటులో ఉంచామన్నారు.

# అమ్మకానికి ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల వాటాలు..!

- ఐదింటిలో వాటాల ఉపసంహరణ
- జాబితాలో సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర





**న్యూఢిల్లీ :** ప్రజల నుంచి తీవ్ర నిరసనల నేపథ్యంలో రెండేళ్లుగా ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయాల వేగాన్ని తగ్గించిన మోడీ సర్కార్.. మళ్లీ అదే ఆలోచన చేస్తోంది. ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి)ల్లోని వాటాలను ప్రయివేటు శక్తులకు కట్టబెట్టడానికి మళ్లీ కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఐదు కీలక బ్యాంక్‌ల్లోని వాటాలను విక్రయించే పనిలో ఉందని సమాచారం. ఈ జాబితాలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఒబి), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిబిఐ), యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బిఎం), పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్ విత్త సంస్థలున్నాయి.

రాబోయే ఆరు నెలల్లో ఈ ఐదు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో దాదాపు 20 శాతం వరకు వాటాలను విక్రయించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని రిపోర్టులు వస్తోన్నాయి. మళ్లీ పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను బిజెపి ప్రభుత్వం వేగవంతం చేస్తోందని సిఎన్‌బిసి అవాజ్ ఓ కథనంలో వెల్లడించింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపి), ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్‌ఎస్) మార్గాల ద్వారా పిఎస్‌బిల్లో వాటాలను విక్రయించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. పిఎస్‌బిల్లో వాటాల విక్రయం వార్తలతో మంగళవారం ఐఒబి షేర్ 0.99 శాతం పెరగ్గా.. సెంట్రల్ బ్యాంక్ షేర్ 2.6 శాతం, యూకో బ్యాంక్ 0.16 శాతం, బిఎం షేర్ 0.59 శాతం తగ్గదలను నమోదు చేశాయి. పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్ షేర్ 3.4 శాతం పెరిగింది. పిఎస్‌బిల్లో పెట్టుబడులను ఉపసంహరించుకోవడం ద్వారా ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నామనే ఆలోచనతో దేశానికి వెన్నెముక లాంటి ఆయా బ్యాంక్‌ల్లో వాటాల విక్రయించడం గమనార్హం.

# మురళి నాయక్ కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి-గోరంట్ల (శ్రీ సత్యసాయి జిల్లా)

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్ కాల్పుల్లో ఇటీవల మరణించిన శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన వీర జవాను మురళినాయక్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల చెక్కును అందజేసింది. రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత మంగళవారం ఉదయం కళ్లితండాకు వెళ్లి మురళినాయక్ తల్లిదండ్రులను పరామర్శించారు. అనంతరం పరిహారం చెక్కును అందించారు. దీంతోపాటు గోరంట్లలో ఆరు సెంట్ల ఇంటి స్థలం, ఐదు ఎకరాల వ్యవసాయ పొలానికి సంబంధించిన పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ యుద్ధంలో మురళి నాయక్ మరణించిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ కుటుంబానికి రూ.50 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించారన్నారు. కళ్లితండా నుంచి జవాన్ మురళి నాయక్ సమాధి వరకు రూ.16 లక్షలతో సిసి రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. పుట్టపర్తి జిల్లా కేంద్రం, గోరంట్ల మండల కేంద్రంలో మురళి నాయక్ విగ్రహాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.



మురళి నాయక్ తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న మంత్రి సవిత



## మోడీ హయాంలో
# విదేశాంగ విధానం అమెరికాకు తాకట్టు

- ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విదేశాంగ విధానాలను అమెరికాకు తాకట్టుపెట్టారని, ఐక్యరాజ్య సమితిలో ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధం విరమణ తీర్మానానికి ఓటు వేయకుండా గైర్హాజరు కావడమే ఇందుకు నిదర్శనమని పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి రామ్మోహన్ అధ్యక్షతన 'యుద్ధం వద్దు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభలు కేరళలోని కోజికోడ్‌లో జరగనున్న నేపథ్యంలో యుద్ధం నశించాలని, ప్రపంచ శాంతి నెలకొల్పాలని విద్యార్థుల్లో అవగాహన కలిగించేందుకు నిర్వహించిన సెమినార్‌లో లక్ష్మణరావు మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా అమెరికా ఆధిపత్యాన్ని పెంచుకోవాలని చూస్తోందని, యుద్ధం ఎక్కడ జరిగినా ఆయుధాలు అమ్మకాల ద్వారా అమెరికా తన మార్కెటింగ్‌ను విస్తృత పరుచుకోవడం చేస్తోందన్నారు. పాలస్తీనా ప్రజలు తమ సొంత భూమిపై స్వతంత్రంగా, గౌరవంతో జీవించే హక్కును కోరుకుంటున్నారన్నారు. అంతర్జాతీయ సమాజంలో చాలా మంది పాలస్తీనా సమస్యను విస్మరించినా, రాజకీయ లాభాల కోసం తప్పుగా చిత్రీకరించినా పాలస్తీనా ప్రజల పోరాటంలో సత్యం కనిపిస్తోందన్నారు. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా అవన్నీ మానవీయ సంక్షోభాలేనన్నారు. ఇజ్రాయిల్ దాడులతో పాలస్తీనాలో ఇప్పటికే 55 వేలమందికి పైగా మరణించారన్నారు. యుద్ధ వాతావరణంతో పాలస్తీనాలో ప్రజలు ఆకలి, దప్పికలు, వైద్యం అందక అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని, ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపేందుకు ప్రపంచ దేశాలు కృషి చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి వి కృష్ణయ్య మాట్లాడుతూ.. యుద్ధం వద్దు-శాంతి ముద్దు అని అన్నారు. అసమానతలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా తెరవెనుక అమెరికా ఉంటోందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. యుద్ధం ఎక్కడ జరిగినా అది తీవ్రమైన ప్రాణనష్టం, ఆస్తినష్టం కలిగిస్తుందన్నారు. పాలస్తీనా సంఘీభావం అనేది శాంతి, సమానత్వం, మానవత్వం కోసమేనన్నారు. స్వేచ్ఛాయుత పాలస్తీనా కోసం ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలన్నారు. ఈ సెమినార్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి సంపర శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ వెంకటేశ్వరరావు, ఎం కిరణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు సమరం, అమూల్య, నవిత, సాయి, గణేష్, విద్యార్థి నాయకులు ప్రణీత, షణ్ముక్, కుమార్, మాధవ్ పాల్గొన్నారు.

**ఎం సాయిబాబాకు నివాళి**

ఎస్ఎఫ్ఐ విజయవాడ నగర అధ్యక్షులుగా పనిచేస్తూ పేదల గుడిసెల కోసం ప్రాణత్యాగం చేసిన ఎం సాయిబాబకు సెమినార్ నివాళి అర్పించింది. ఈ సందర్భంగా సాయిబాబ తమ్ముడు మురళికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శులు వి కృష్ణయ్య, సంపర శ్రీనివాస్ ఎస్ఎఫ్ఐ లక్ష్యాలతో కూడిన మెమొంటోను బహుకరించారు.

# విజన్ కోసం కన్సల్టెంట్లు

- 175 మంది నియామకానికి నిర్ణయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

స్వర్ణాంధ్ర విజన్-2047 కోసం కన్సల్టెంట్ల పేరిట యువ నిపుణులను నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఈ నియామకాలు ఉంటాయి. ఈ నియామకాలు రాష్ట్ర ప్లానింగ్ సొసైటీ ద్వారా నిర్వహిస్తారు. నియమితులైనవారు నాలుగేళ్లపాటు వారు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. దీనికోసం రూ.50.40 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఒక్కో కన్సల్టెంట్‌కు నెలకు రూ.60 వేలు చెల్లించాలని నిర్ణయించారు. విజన్ 2047లో భాగంగా నియోజకవర్గాల విజన్ కార్యాచరణ ప్రణాళికను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒక్కో నియోజకవర్గ యూనిట్‌కు జిల్లా కలెక్టర్ ప్రతిపాదించిన ఒక అధికారి పర్యవేక్షిస్తారు. గ్రామ సచివాలయాల నుంచి ఐదుగురు, ఒక విద్యావేత్త సభ్యులుగా ఉంటారు. అలాగే ఒక్కో కన్సల్టెంట్‌ను కూడా నియమించాలని గతంలోనే నిర్ణయించిన సంగతి తెలిసిందే. అధ్యక్షులుగా శాసనసభ్యుడు వ్యవహరిస్తారు.



# యోగాసనాలు కాదు.. ఉద్యోగాలు ఇవ్వండి

- విశాఖలో యువత నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

'యోగాసనాలు కాదు.. ఉద్యోగాలు ఇవ్వండి' అంటూ విశాఖ నగరంలోని బిర్లా జంక్షన్ వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువత యోగాసనాలు వేస్తూ మంగళవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు మాట్లాడుతూ యోగా పేరిట మోడీ దగ్గర మెప్పు కోసం, గిన్నిస్ బుక్ రికార్డుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తూ యువతను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. యువత నిరుద్యోగంతో బాధపడుతోందని తెలిపారు. ఎన్నికలకు ముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ విషయాన్నే విస్మరించడం యువతను మోసగించడమే నన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారో లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'యోగాంధ్ర సరే నిరుద్యోగాంధ్ర సంగతి ఏంటి' అని ప్రశ్నించారు. ప్రశ్నించడమే తన పని అన్న పవన్ కల్యాణ్ యువత ఉద్యోగాల కోసం పట్టించుకోకుండా పదవి అనుభవిస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగం వల్ల అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రావణ్, నాయకులు సంతోష్, చిన్నా, సాధు, రాంబాబు పాల్గొన్నారు.

# సమస్యల్లో ఎయిర్ ఇండియా !

- ఐదు సర్వీసులు రద్దు

**ముంబయి, కోల్‌కతా :** మూడున్నరేళ్ళ క్రితం టాటా గ్రూపు కొనుగోలు చేసిన తర్వాత అతిపెద్ద సంక్షోభాన్ని ఎయిర్ ఇండియా ఎదుర్కొంటోంది. ఎయిర్ ఇండియాలో సమస్యలు కొనసాగుతునే వున్నాయి. వివిధ కారణాలతో పలు విమానాలు రద్దయ్యాయి. మంగళవారం లండన్, పారిస్ నగరాలకు వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానాలు రద్దు కాగా, శాన్‌ఫ్రాన్సిస్కో - ముంబయి విమానం స్టాప్ ఓవర్ సమయంలో ఒక లోపం కారణంగా ప్రయాణికులు విమానాన్ని దిగాల్సి వచ్చింది. ప్రయాణానికి ముందు జరిగే తనిఖీల్లో భాగంగా కొన్ని సమస్యలు కనుగొనడంతో ఢిల్లీ-పారిస్ విమానాన్ని రద్దు చేశారు. అందుబాటులో మరో విమానం లేకపోవడంతో అహ్మదాబాద్-లండన్ విమాన సర్వీసు రద్దు చేసినట్లు ఎయిర్‌లైన్స్ వర్గాలు తెలిపాయి.

మరో సంఘటనలో శాన్‌ఫ్రాన్సిస్కో - ముంబయి విమానం మంగళవారం ఉదయం కోల్‌కతాలో స్టాప్‌ఓవర్ కోసం ఆగిన సమయంలో ఒక ఇంజనులో సాంకేతిక లోపం తలెత్తడంతో నిలిపివేశారు. మొత్తంగా ఐదు సర్వీసులు రద్దయ్యాయి. వాటిలో ఢిల్లీ-దుబాయ్, ఢిల్లీ-వియన్నా, ఢిల్లీ-పారిస్, అహ్మదాబాద్-లండన్, బెంగళూరు - లండన్, లండన్ - అమృతసర్ సర్వీసులు వున్నాయని ఎయిర్ ఇండియా వెబ్‌సైట్ పేర్కొంటోంది. వీటికి తోడుగా, ఢిల్లీకి రావాల్సిన ఎఐ 315 డ్రీమ్‌లైనర్ విమానంలో సాంకేతిక సమస్య రావడంతో ఆ పైలట్ హాంకాంగ్‌కు తిరిగి వెళ్లాల్సి వచ్చింది.

సంపాదకీయం

# శాంతియుత పరిష్కారం

**అ**మెరికా అండదండలతో ఇజ్రాయిల్ ఏకపక్షంగా ఇరాన్‌పై దాడులు చేయడం దుర్మార్గం, గర్హనీయం. నెతన్యాహు సర్కారు గాజాలో మొదలుపెట్టిన నరమేధాన్ని క్రమంగా విస్తరిస్తూ... పశ్చిమాసియాను అగ్నిగుండంగా మార్చేసింది. యుద్ధాలను ఆపేస్తానంటూ గద్దెనెక్కిన ట్రంప్... వాటికి మరింతగా ఆజ్యం పోస్తూ... ప్రపంచానికే పెనుముప్పుగా పరిణమిస్తున్న విధ్వంసాలకు మద్దతుగా నిలవడం గర్హనీయం.


అమెరికాను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి ట్రంప్ అనుసరించిన సుంకాల యుద్ధం స్వదేశంలోనే వ్యతిరేకతను తెచ్చిపెట్టింది. ఉక్రెయిన్ యుద్ధం ఆపానన్న ప్రకటనలు ఆచరణ రూపం దాల్చలేదు. ఈ పరిస్థితుల్లో నెతన్యాహు భుజాలపై నుంచి ఇరాన్‌తో యుద్ధం చేస్తున్నాడు. ఐదు రోజుల క్రితం ఆకస్మికంగా దాడి చేసి తాజా ఉద్రిక్తతలకు నాంది పలికిన ఇజ్రాయిల్... అణ్వస్త్రాల తయారీకి ఇరాన్ చేరువలో ఉన్నందున ఆ ప్రయత్నాలను అడ్డుకోవడం, ఇరాన్ సుప్రీం నేత, మత పెద్ద ఖమేనీ కనుసన్నల్లోని ప్రభుత్వాన్ని పడగొట్టడం లక్ష్యాలుగా దాడులు చేసినట్టు నెతన్యాహు ప్రకటించుకున్నారు. ఆకస్మిక దాడులతో ఇరాన్ కీలక ఆర్మీ కమాండర్లను కోల్పోయింది. అణుకేంద్రాన్ని, దక్షిణ ఇరాన్‌లోని ప్రపంచంలోనే అతి పెద్ద సహజవాయు క్షేత్రాన్ని, టెహ్రాన్ వెలుపల చమురు డిపోను ఇజ్రాయిల్ సైన్యం పేల్చివేసింది. ఇరాన్ ప్రతిదాడులు చేయడంతో టెల్ అవీవ్ కూడా వణికిపోతోంది. రెండు దేశాల రాజధానుల్లోని పౌరులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇజ్రాయిల్ గూఢచారి సంస్థ మొసాద్ కార్యాలయం సైతం ఆహుతైంది. అమెరికా, ఇజ్రాయిల్‌లు ప్రచారం చేసుకున్న ఐరన్ డోమ్ రక్షణ ఉన్నా టెల్ అవీవ్ కకావికలం కావడం గమనార్హం. జి-7 సదస్సు నుంచి హుటాహుటిన వాషింగ్టన్‌కు ట్రంప్ వెళ్లిపోవడం, టెహ్రాన్‌ను ఖాళీ చేయాలంటూ ట్రంప్, ఇజ్రాయిల్ హెచ్చరించడం ఏ పరిణామాలకు దారితీస్తుందో చూడాలి.

నెతన్యాహు వాదన అబద్ధమనడానికి అణుబాంబు తయారీకి దరిదాపుల్లో కూడా ఇరాన్ లేదని సాక్షాత్తు అమెరికా ఇంటెలిజెన్స్ చీఫ్ కొన్ని వారాల క్రితమే ప్రకటించడం రుజువు. ఏ దేశంలోనైనా పాలకులను నిర్ణయించుకునేది ఆ దేశ ప్రజలే. ఒక దేశంలో ప్రభుత్వాలను మార్చాలని మరో దేశం ప్రయత్నించడం ఆ దేశ సార్వభౌమత్వంపై, అంతర్జాతీయ న్యాయ సూత్రాలపై దాడే. ఇరాక్‌లో రసాయన ఆయుధాలున్నాయంటూ సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు అమెరికా పన్నిన కుయుక్తులు అందరికీ తెలిసినవే. ఇప్పుడు ట్రంప్ వత్తాసుతో ఇజ్రాయిల్ చేస్తున్నదీ అదే. యుద్ధం ఆగితే.. గద్దె దిగి.. యుద్ధ నేరాలను ఎదుర్కొనే స్థితిలో ఉన్న నెతన్యాహు సాగిస్తున్న దమనకాండ అత్యంత గర్హనీయం. హమాస్ పేరుతో గాజాపై, హౌతీల పేరుతో యెమెన్‌పై విరుచుకుపడి, పాలస్తీనాలో 55 వేల మందికిపైగా... అందునా చిన్నారులు, మహిళలను ఊచకోత కోసిన ఇజ్రాయిల్ పాపాలు చరిత్రలో ఎప్పటికీ చెరగని చీకటి అధ్యాయానికి గుర్తుగా నిలిచిపోయేవే. చమురుపై ఆధిపత్యం కోసం, పశ్చిమాసియాపై పట్టుకోసం ఇజ్రాయిల్ నరమేధాన్ని ప్రోత్సహిస్తున్న అమెరికాతోపాటు పశ్చిమ దేశాల పాపం కూడా చిరకాలం నిలిచిపోయేదే.

గతంలో ఇరాన్‌తో ఒబామా కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దు చేసి సమస్యకు కారణమయ్యిందీ, యుద్ధాల నుంచి ప్రపంచాన్ని విముక్తి చేస్తానంటూ బీరాలు పలికిందీ ట్రంపే. ఇజ్రాయిల్‌కు వత్తాసు పలుకుతూ... ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేస్తుండటంపై సగటు అమెరికన్లతోపాటు స్వపక్షంలోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

అమెరికాతో అణుచర్చలు సాగుతున్న సమయంలో రెండు రోజుల్లో ఆరోదఫా కీలక చర్చలతో సమస్యకు పరిష్కారమవుతుందని ఆశిస్తున్న వేళ ఇజ్రాయిల్ చేపట్టిన దాడులు ప్రపంచ శాంతికి భంగకరం. పర్షియన్ గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై దాడులు, హోర్ముజ్ జలసంధిని మూసివేయడం ద్వారా ఒమన్ గల్ఫ్‌లోని ట్యాంకర్లను లక్ష్యం చేసుకోవడం ద్వారా ఇరాన్ ప్రతీకారం తీర్చుకుంటే భద్రతతోపాటు ప్రపంచాన్ని మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేసేదే. ఈ పరిణామాలతో పెట్రో ధరలు 40 శాతం పెరగొచ్చని అంచనా. 80 శాతం దిగుమతులపై ఆధారపడిన భారత్ ఆర్థిక వ్యవస్థకూ అశనిపాతమే! తన రాజకీయ అవసరాల కోసం ప్రపంచ శాంతిని పణంగా పెట్టిన నెతన్యాహును, చిరకాల మిత్రదేశమైన ఇరాన్‌నూ ఒకే గాటన కట్టడం ఎంతమాత్రం 'విశ్వగురు'కు తగదు. ఇండియా, పాక్ యుద్ధాన్ని ఆపేశానంటూ తాజాగా మరోసారి చెప్పుకున్న ట్రంప్ వ్యాఖ్యలను పార్లమెంట్ సాక్షిగా ఖండించాల్సిన ప్రధాని అమెరికా తొత్తులా మూగనోము పట్టడం సిగ్గుచేటు. ప్రపంచ శాంతికి పెనుముప్పుగా మారిన ఇజ్రాయిల్ వైఖరిని అన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టి, సంబంధాలను తెగతెంపులు చేసుకోవడంతోపాటు ప్రపంచ దేశాలతో కలిసి ఒత్తిడి చేయడం ద్వారా టెహ్రాన్ - టెల్ అవీవ్‌ల మధ్య మంటలను ఆర్పి, శాంతియుత పరిష్కారం కనుగొనడంలో భాగస్వామిగా మారడం భారత్ ప్రయోజనాలకు తక్షణ అవసరం.

మహనీయుల మాట



**చేయాల్సిన పనిని**
**చిరునవ్వుతో చేస్తే**
**సహకారం అనిపించుకుంటుంది.**
**- గోర్కీ**
**ప్రపంచ ప్రసిద్ధ రచయిత.**



# ప్రజా పాత్రికేయుడు కామ్రేడ్ మోటూరు హనుమంతరావు

సందర్భం

**బి.వి. రాఘవులు**

**కా**మ్రేడ్ మోటూరు హనుమంతరావు బహుముఖ ప్రజ్ఞాశాలి. జాతీయోద్యమ కాలంలో విద్యార్థి రంగంలో ఉద్యమం జీవితం ప్రారంభించి, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా, నాయకుడిగా పీడిత ప్రజల కోసం ఆరు దశాబ్దాలపాటు చివరి శ్వాస వరకు కృషి చేశారు. మార్క్సిస్టు పార్టీ కార్యదర్శిగా 18 ఏళ్ళపాటు బాధ్యతలు నిర్వహించారు. శాసన సభ్యుడిగా (1952-54), శాసన మండలి సభ్యుడిగా (1978-1984), రాజ్యసభ సభ్యునిగా (1988-1994) పీడిత ప్రజల తరపున తన గళాన్ని వినిపించారు. సిద్ధాంతకర్తగా, గొప్ప వక్తగా విప్లవోద్యమానికి ఎనలేని సేవలందించారు. నిరాడంబరంగా, నిగర్విగా స్నేహశీలిగా అందరి గౌరవాన్ని పొందారు. తన ఉద్యమ జీవితంలో మూడు సార్లు నాలుగున్నర సంవత్సరాల పాటు నిర్బంధించబడ్డా, ఐదున్నర సంవత్సరాలపాటు అజ్ఞాతానికి వెళ్ళాల్సి వచ్చినా, కమ్యూనిస్టు పార్టీలో సైద్ధాంతిక విబేధాలతో ఒడిదుడుకులు వచ్చినా ధైర్యంగా ఎదురొడ్డి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడంలో ముందు పీఠిన ఉన్నారు.

అయితే కామ్రేడ్ హనుమంతరావు జీవితంలో అన్నింటికన్నా విశిష్టమైనది ప్రజా పాత్రికేయునిగా ఆయన నిర్వహించిన బాధ్యత. హనుమంతరావు గారి పాత్రికేయ జీవితం స్వాతంత్ర్యానంతరం 50వ దశకంలో ప్రారంభమై 90వ దశకంలో ముగిసింది. ఈ కాలంలో మీడియా రంగంలో ప్రింట్ మీడియా ప్రధాన పాత్ర నిర్వహించింది. ప్రజలకు సమాచారాన్ని ఇవ్వడం రాజకీయ విశ్లేషణలు అందించడం ప్రధానంగా పత్రికల ద్వారానే జరిగింది. కమ్యూనిస్టు పార్టీ అధికార పత్రిక అయిన విశాలాంధ్రకు ఆయన ఎనిమిది సంవత్సరాలు సంపాదకునిగా చేశారు. మార్క్సిస్టు పార్టీ ఆవిర్భవించిన తర్వాత వారి సంపాదకత్వంలోనే ప్రజాశక్తి వారపత్రిక ప్రారంభమైంది. ఆయన సారథ్యంలోనే 1981లో ప్రజాశక్తి దినపత్రిక అయింది.

ఆయన రచనలలో సూటిదనం, కరుకుదనం, గంభీరత, విశ్లేషణ, వాదనా పటిమ ఉట్టిపడతాయి. జై తెలంగాణ, జై ఆంధ్ర విచ్ఛిన్న ఉద్యమాలు రాష్ట్రంలో తలెత్తినప్పుడు ఏటికి ఎదురీదుతున్నట్లు పరిస్థితులున్నా తెలుగు ప్రజల సమైక్యతను సమర్థిస్తూ ఆయన చేసిన రచనలు సమైక్యవాదులకు దిక్సూచిగా నిల్చాయి. ఆయన రాసిన 'విశాలాంధ్రలో విషాద ఛాయలు' అన్న చిన్న పుస్తకాన్ని ఇప్పటికీ మనం మర్చిపోలేం.

కామ్రేడ్ మోటూరు వర్ధంతి సందర్భంగా మీడియా రంగంలో వచ్చిన మార్పులు గురించి ప్రస్తావించుకోవడం సబబుగా ఉంటుంది. జాతీయోద్యమ కాలంలో వలస పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించడంలో పత్రికలు గొప్ప పాత్రను నిర్వహించాయి. ఆ కాలంలో కమ్యూనిస్టులు నిర్బంధాలను, అణచివేతలను ఎదుర్కొని అనేక పత్రికలను ప్రచురించారు. ప్రజలను చైతన్యవంతులను చేయడంలో, వాస్తవాలను ప్రజలకు చేర్చడంలో దోపిడీని, దుర్మార్గాలను వెల్లడించడంలో అబద్ధాలను, మభ్యపెట్టడాన్ని బట్టబయలు చేయడంలో ఉద్యమకారులకు పత్రికలు, సభలే ఆనాడు ప్రధానమైన సాధనాలయ్యాయి.

స్వాతంత్ర్యం అనంతరం కొన్ని పత్రికల స్వభావం మారినా, కమ్యూనిస్టు పత్రికలు ప్రజల తరపున ఉద్యమ పత్రికలుగానే కొనసాగాయి. దోపిడీ, అణచివేతలు కొనసాగినంత కాలం ప్రజా పత్రికలు ఈ పాత్రను నిర్వహించక తప్పదు. ఈ కాలంలో తెలుగు ప్రజల కోసం కమ్యూనిస్టు పార్టీ 'విశాలాంధ్ర'ను ప్రారంభించింది. విశాలాంధ్ర పేరులోనే వుంది, అది ఉద్యమ పత్రికని. జాతీయోద్యమ కాలంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును ప్రతిపాదించిన కాంగ్రెస్, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మాట మార్చడంతో దేశవ్యాపితంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలకోసం ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉద్యమాలలో కమ్యూనిస్టులు ముందుపీఠిన ఉన్నారు. ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టులు ఉద్యమ లక్ష్యాన్ని వ్యక్తం చేసే 'విశాలాంధ్ర' పేరును తమ అధికార పత్రికకు పెట్టుకున్నారు. ఈ ఉద్యమ నేపథ్యంలోనే సుందరయ్య గారు విశాలాంధ్రలో ప్రజారాజ్యం అన్న పుస్తకాన్ని రాశారు.

వాస్తవాలు తెలుసుకోవాలంటే కమ్యూనిస్టు పత్రికలు చదవాలన్న భావం ప్రజల్లో ఉండేది. ఉద్యమ లక్ష్యం, ప్రజల ప్రయోజనం దిక్సూచిగా ఉండే ఏ పత్రికకైనా సత్య సంధత ఉంటుంది. నిజం, నిర్భయత్వం ఉంటుంది. అందుకే హంగులు, ఆర్భాటాలు లేకపోయినా కమ్యూనిస్టు పార్టీల పత్రికలు ఆనాడు ప్రజల నమ్మకాన్ని చూరగొన్నాయి.

స్వచ్ఛంద శ్రమతో ప్రజల సహాయంతో విశాలాంధ్ర, ప్రజాశక్తి వంటి పత్రికలు నడిచేవి. ఆధునిక మార్పులకు అవసరమైన పెట్టుబడి ఖర్చు పెరిగిపోతూ ఉంటే ఈ పత్రికలకు ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా ఉద్యమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాయి.

1990 దశకం వరకు పత్రికా రంగమే ప్రధానంగా మీడియా రంగంగా ఉండేది. సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో, వినోదాన్ని అందించడంలో ఆలిండియా రేడియో 1937 నుండి ఉనికిలో ఉన్నా టెలివిజన్ 1957లో విద్యా కార్యక్రమాల కోసం ప్రారంభమైనా పూర్తి స్థాయి కార్యక్రమాల కోసం అది 1976లో దూరదర్శన్ అవతారం ఎత్తినా, పత్రికలే ప్రధాన సమాచార సాధనాలుగా కొనసాగాయి.

కానీ ఆ తర్వాత సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు ప్రారంభమవడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. శాస్త్ర సాంకేతిక రంగాలలో వచ్చిన గుణాత్మకమైన మార్పులలో పత్రికా రంగానికి సమాంతరంగా టెలివిజన్, రేడియోలు విస్తరించాయి. ఇంటర్‌నెట్, బ్రాడ్ బ్యాండ్, శాటిలైట్ వినియోగం, డెస్క్ టాప్, కంప్యూటర్లు, వరల్డ్ వైడ్ వెబ్, సెల్‌ఫోన్, స్మార్ట్ ఫోన్లు వ్యాపించాయి.



**నేడు కామ్రేడ్ ఎం.హెచ్ 24వ వర్ధంతి**

కొన్ని గణాంకాలను పరిశీలిస్తే ఎంత మార్పు వచ్చిందో తెలుసుకోవచ్చు. ఇప్పటికీ మన దేశంలో వార్తా పత్రికల సర్క్యులేషన్ స్థిరంగా కొనసాగుతున్నా ఇతర మీడియా రూపాలు వేగంగా వ్యాపిస్తున్నాయి. 2009 నాటికి ఇంటర్‌నెట్ వినియోగదారులు 81,000,000 ఉన్నారు. 2009లో టెలివిజన్ ప్రసార కేంద్రాలు 1400 ఉన్నాయి. 2024లో పత్రికల సర్క్యులేషన్ 2,32,00,000, మొబైల్ ఫోన్ వినియోగదార్ల సంఖ్య 116.3 కోట్లకు పెరిగింది. దేశంలో మొబైల్ ఫోన్ సర్వీసు 1995లో ప్రారంభమైంది. ఆ సంవత్సరం జులై 31న మొట్టమొదటి కాల్‌ను కలకత్తా నుండి ఢిల్లీకి నాటి పశ్చిమ బెంగాల్ వామపక్ష ప్రభుత్వ ముఖ్యమంత్రి జ్యోతిబసు చేశారు.

ఒక సర్వే ప్రకారం 2025 మే నాటికి దేశంలో 85.5 శాతం కుటుంబాలలో కనీసం ఒక స్మార్ట్‌ఫోన్ అయినా ఉన్నది. 2024 ఆగష్టు నాటికి దేశంలో 112 కోట్ల సెల్యులార్ కనెక్షన్లు ఉన్నాయి. అంటే 78 శాతం ప్రజలకు ఈ సౌకర్యం అందుబాటులో ఉన్నదన్న మాట. ట్రాయ్ ఇచ్చిన వివరాల ప్రకారం 2023లో 91 కోట్ల 81 లక్షల మంది అంటే 68 శాతం ప్రజలు అంతర్జాల సౌకర్యాన్ని కలిగి ఉన్నారు. 2024లో 33 శాతం ప్రజలు అంటే 46 కోట్ల 70 లక్షల సోషల్ మీడియా అకౌంట్లు ఉన్నాయి.

> **సిద్ధాంతకర్తగా, గొప్ప వక్తగా విప్లవోద్యమానికి ఎనలేని సేవలందించారు. నిరాడంబరంగా, నిగర్విగా స్నేహశీలిగా అందరి గౌరవాన్ని పొందారు. తన ఉద్యమ జీవితంలో మూడు సార్లు నాలుగున్నర సంవత్సరాల పాటు నిర్బంధించబడ్డా, ఐదున్నర సంవత్సరాలపాటు అజ్ఞాతానికి వెళ్ళాల్సి వచ్చినా, కమ్యూనిస్టు పార్టీలో సైద్ధాంతిక విబేధాలతో ఒడిదుడుకులు వచ్చినా ధైర్యంగా ఎదురొడ్డి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడంలో ముందు పీఠిన ఉన్నారు. అయితే కామ్రేడ్ హనుమంతరావు జీవితంలో అన్నింటికన్నా విశిష్టమైనది ప్రజా పాత్రికేయునిగా ఆయన నిర్వహించిన బాధ్యత.**

సమాచార, ప్రసార సాధనాలలో వచ్చిన ఈ పెను మార్పు మీడియాపై కూడా పడింది. సమాచారం కోసం ప్రజలు ఈ సాధనాలవైపు మొగ్గారు. క్రమేణా ఈ రంగాలన్నీ పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థల్లోకి పోయి సమాచార ప్రసారాలను ప్రజలకోసం కన్నా తమ వ్యాపార ప్రయోజనం కోసం, తమకు ప్రాతినిధ్యం వహించే రాజకీయ శక్తుల అవసరాలకోసం వినియోగించడం మొదలైంది. సంపాదక నిబద్ధతకు, స్వయం ప్రతిపత్తి విలువ తగ్గిపోయి, యాజమాన్య ప్రమేయంతో మీడియా నడిచే నూతన పరిస్థితి వచ్చింది. పత్రికా, ప్రసార రంగాలలో ప్రైవేటు పెట్టుబడి పెరిగింది. సమాచారాన్ని అందించడంలో పత్రికల పాత్ర తగ్గిపోతూ వస్తున్నది. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ (ఎక్స్), యూట్యూబ్, ఆన్‌లైన్ పోర్టళ్లు వంటి కొత్త మాధ్యమాలు వార్తలకు, సమాచారానికి ప్రధాన మార్గాలుగా మారాయి. ఈ మార్పులు విస్తారమైన ప్రజానీకానికి విస్తృతమైన సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చాయి. ఇంకొక రకంగా చెప్పాలంటే సమాచార విస్ఫోటనాన్ని ప్రజలు చూస్తున్నారు. ప్రజా జీవితంలోని అన్ని అంశాలను అర్థం చేసుకోవడానికి, అన్ని విషయాలలో జోక్యం చేసుకోవడానికి అవకాశాలు విస్తృతమయ్యాయి.

అయితే అదే సమయంలో సమాజానికి, ప్రజల ప్రయోజనానికి హాని కల్గించే ధోరణులు కూడా పెరిగాయి. ఈ రోజు వార్తల కోసం సోషల్ మీడియా, ఆన్‌లైన్ న్యూస్ పోర్టళు ,, సోషల్ మీడియా నెట్‌వర్క్ (వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, రీల్స్, పాడ్‌కాస్ట్ వగైరా)పై ప్రజలు ఆధారపడుతున్నారు. మీడియా ప్రపంచంపై కార్పొరేట్ పెట్టుబడిదార్ల పట్టు బిగిసిపోయింది. వారి ఆర్థిక ప్రయోజనాలు, వారి రాజకీయ మిత్రుల ప్రయోజనాలకు మీడియా పనిచేసే ధోరణి వ్యాపించింది. తమ అవసరాలను నెరవేర్చే మేరకు సమాచారాన్ని ఇవ్వడం, వక్రీకరించి, కొన్ని సందర్భాలలో కల్పించి కూడా సమాచారాన్ని వ్యాపించడం ఆనవాయితీ అయ్యింది. ఇది సోషల్ మీడియాలో మరీ శృతి మించి పోయింది. ఫేక్ న్యూస్, వైషమ్యాలను రెచ్చగొట్టే, అసభ్యత, అశ్లీలతను ప్రోత్సహించే, ద్వేషపూరిత, కక్షపూరిత ట్రోలింగ్ చేయడాలు మీడియా యొక్క గౌరవాన్ని, నిబద్ధతను, నమ్మకాన్ని దెబ్బ తీస్తున్నాయి. అన్నింటికన్నా సామాన్య ప్రజల ప్రయోజనాలు, ఆకాంక్షలు, అవసరాలు మీడియాలో పూర్తిగా మరుగున పడిపోతున్నాయి.

ఈ పరిస్థితిని మార్చాలి. ఇప్పుడు మన ముందున్నది మీడియాను ప్రజల బాట పట్టించడం ఎలా అనేది. ప్రజల పట్ల విశ్వాసం, లక్ష్యం పట్ల అంకిత భావం ఉన్న మీడియా అవసరం గతంకన్నా ఇప్పుడు ఎక్కువైంది. కార్పొరేట్ మీడియాకు ప్రత్యామ్నాయంగా నిలవగల్గే మీడియా బలపడాల్సిన అవసరం ఎప్పుడూ లేనంతగా పెరిగింది. సామాన్య ప్రజల ఆకాంక్షలను, అందులో అణచి వేయబడుతున్న తరగతుల ప్రయోజనాలను, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, మానవతా విలువల కోసం మీడియా నిలబడాలి. అటు డిజిటల్ మీడియాలోనూ, ఇటు పత్రికా రంగంలో అటువంటి ప్రత్యామ్నాయ వ్యవస్థలు నెమ్మదిగానైనా వ్యాపిస్తున్నాయి. కానీ పాలకులు, బిజెపి, సంఘపరివార్ శక్తులు ఈ స్వతంత్ర మీడియాను సహించలేకపోతున్నాయి. కార్పొరేట్ శక్తులు ఆర్థిక బలాన్ని, రాజ్యపు అధికారాన్ని ఉపయోగించి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నాయి. 1975 నాటి ఎమర్జెన్సీ కాలంలో ఆనాటి ప్రభుత్వం మీడియా స్వేచ్ఛపై దాడిజేసింది. ఆనాడు హనుమంతరావు లాంటి పాత్రికేయులు ఎదురుతిరిగి నిరసన వ్యక్తం చేశారు. ప్రతిఘటించారు. ఈ రోజు మతోన్మాద నిరంకుశ బిజెపి ప్రభుత్వం, సంఘపరివార్ ఫాసిస్టు శక్తులు పాత్రికేయులను వేధిస్తున్నాయి, తప్పుడు కేసులు పెడుతున్నాయి. జైలుపాలు చేస్తున్నాయి. ఈ నిర్బంధాలను ప్రతిఘటించి స్వతంత్ర, ప్రత్యామ్నాయ మీడియాను రక్షించుకోవాలి.

హనుమంతరావు గారి తరం ప్రజా మీడియాను, ప్రత్యామ్నాయ మీడియాను ఎలా ముందుకు తీసుకు పోయిందో నేడు మీడియా రంగంలో అటువంటి ప్రయత్నం చేస్తున్న శక్తులను బలపర్చుకోవాల్సి ఉంది.

**/ వ్యాసకర్త సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు /**

★




# మోడీ ఏలుబడిలో మరింత దిగజారిన లింగ అంతరం

విమర్శ

**ఎం. కోటేశ్వరరావు**

**ప**దకొండు సంవత్సరాల నరేంద్ర మోడీ పాలన విజయోత్సవాలంటూ బిజెపి, దాని మిత్రపక్షాలు సంబరాలు చేసుకుంటున్నాయి. సగం మందిగా ఉన్న మహిళల స్థితి బాగుపడకుండా ఎన్ని కబుర్లు చెప్పినా అది నిజమైన వృద్ధి కాదు. పచ్చి నిజం ఏమిటంటే నరేంద్రమోడీ అధికారానికి వచ్చిన తరువాత దేశంలో లింగ అంతరం తగ్గలేదు కదా, అంతకు ముందు కంటే దిగజారింది. దీనివలన జిడిపికి జరుగుతున్న నష్టం మామూలుగా లేదు. 2015లో మెకెన్సీ గ్లోబల్ సంస్థ చెప్పినదాని ప్రకారం (2015 సెప్టెంబరు 25 టైమ్స్ ఆఫ్ ఇండియా) పురుషులతో సమంగా ఉపాధి, సమాన పనికి సమాన వేతనం గనుక అమలు జరిపితే ప్రపంచ జిడిపికి 2025 నాటికి 12 లక్షల కోట్ల డాలర్లు తోడవుతాయని, దానిలో ఎక్కువ మొత్తం 2.9 లక్షల కోట్ల డాలర్లు భారత్‌లో తోడవుతాయని స్పష్టంగా పేర్కొన్నది. అది నాటి వేతనాలు, ద్రవ్యోల్బణం తదితరాల ప్రాతిపదికన వేసిన అంచనా. ఈ మొత్తం ఇప్పుడు అంచనా వేస్తున్న 4.187 లక్షల కోట్ల డాలర్లకు అదనం, జర్మనీని కూడా దాటి మూడో స్థానంలోకి వెళ్లి పోయి ఉండేది.

కేంద్రంలోనూ, మెజారిటీ రాష్ట్రాలలో మేము, మా మిత్రులం ఉన్నాం అని చెబుతున్న నరేంద్ర మోడీ గుజరాత్ సిఎంగా అనుభవం ఉన్నప్పటికీ మెకెన్సీ నివేదిక చెప్పిందేమిటో అర్థం కాలేదా? లేక వారేమిటి మాకు చెప్పేది అని ఖాతరు చేయలేదా? ఇంతవరకు లింగ అంతరం, ఆర్థిక అసమానతల తగ్గింపుకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? మోడీ విజయ గీతాలాపనలో తలమునకలుగా ఉన్న మీడియాలో ఎక్కడా దీని ప్రస్తావన కనిపించదు, వినిపించదు. 2014లో ప్రపంచ ఆర్థిక వేదిక విడుదల చేసిన నివేదిక ప్రకారం లింగ అంతరంలో 142 దేశాల్లో మన స్థానం 114, వచ్చిన పాయింట్లు 0.6455 కాగా అదే సంస్థ విడుదల చేసిన 2025 నివేదికలో 148 దేశాలకు గాను 131వ స్థానంలో ఉన్నాం, వచ్చిన మార్కులు 0.644, గతం కంటే తగ్గాయి. జపాన్ కంటే ఈ ఏడాది కొన్ని వేల కోట్ల డాలర్లు ఎక్కువగా ఉండి నాలుగో స్థానం లోకి వస్తుందన్న అంచనాలను చూసి పండగ చేసుకున్న వారు లింగ అంతరం దిగజారటం గురించి మాట్లాడరేం!

పదకొండు సంవత్సరాలుగా ఎన్ని కబుర్లు చెప్పినా మహిళలపై జరుగుతున్న అన్యాయానికి అంతం లేదు. లింగ అంతరం అంటే స్త్రీ, పురుషుల మధ్య ఉన్న సమానత్వంలో ఉన్న తేడా మదింపు. అవకాశాలు, విద్య, ఆరోగ్యం, రాజకీయ సాధికారత, బతికి ఉండటం సంబంధిత అంశాలను పరిగణనలోకి తీసుకొని ఇచ్చే మార్కుల ఆధారంగా సూచికలను తయారు చేస్తారు, వాటికి ఆయా దేశాలు ఇచ్చే సమాచారమే ప్రాతిపదిక. ఆర్థిక భాగస్వామ్యం, విద్య, వైద్యం, రాజకీయ సాధికారత అనే నాలుగు అంశాలపై విడివిడిగా సూచికలు రూపొందిస్తారు, వాటన్నింటిని కలిపి సాధారణ లింగ అంతర సూచికను తయారు చేస్తారు. వీటిలో కొన్ని పెరుగుదల తగ్గుదల ఉన్నప్పటికీ పది సంవత్సరాలలో మొత్తం మీద స్వల్ప తగ్గుదల నమోదైంది. పార్లమెంటులో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని బిల్లు ఆమోదించినప్పటికీ గత ఎన్నికలలో తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. అందువలన మహిళా సాధికారత సూచికలో 2023 కంటే 2025లో 14.7 నుంచి 13.8కి పాయింట్లు తగ్గిపోయాయి. మహిళలకు మంత్రి పదవులు కూడా 6.5 నుంచి 5.6 శాతానికి పడిపోయాయి.

బేటీ పఢావో బేటీ బచావో (ఆడపిల్లల్ని చదివించండి, ఆడపిల్లల్ని రక్షించండి) అంటూ పదేళ్ల క్రితం ఘనంగా ఒక పథకాన్ని నరేంద్ర మోడీ ప్రారంభించారు. వాస్తవం ఏమిటంటే దానికి కేటాయించిన నిధులే స్వల్పం కాగా ఆ మొత్తాన్ని కూడా ఖర్చు చేయటం లేదు. ఆరేళ్ల లోపు బాలబాలికల నిష్పత్తి 1961 నుంచి మన దేశంలో పడిపోతోంది. 1991లో ప్రతి వెయ్యి మంది బాలురకు గాను 945 మంది బాలికలు ఉండగా క్రమంగా తగ్గుతూ 2011 నాటికి 918కి పడిపోయింది. తరువాత ఇంతవరకు జనాభా లెక్కలు జరగలేదు గనుక కేవలం అంచనాలు మాత్రమే చెబుతున్నారు. 2019-21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం అంతకు ముందు 2015-16తో పోల్చితే 919 నుంచి 929పెరిగిందని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 934, తెలంగాణలో 894 మంది ఉన్నారు. కేంద్ర గణాంకశాఖ 2023లో విడుదల చేసిన భారత్‌లో స్త్రీ, పురుషులు అనే నివేదిక ప్రకారం 2036 నాటికి ప్రతి వెయ్యి మంది మగపిల్లలకు 952 మంది ఆడపిల్లలు ఉంటారని అంచనా వేశారు. మొత్తంగా స్త్రీ, పురుషుల నిష్పత్తిని చూస్తే 2025లో ప్రతి 106.453 మంది పురుషులకు వందమంది మహిళలు ఉన్నారని, దీని ప్రకారం జనాభాలో పురుషులు 51.56 శాతం ఉన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం 48.44 శాతంగా ఉన్న మహిళలు 2036 నాటికి 48.8 శాతానికి పెరుగుతారని అంచనా. 2010లో ప్రతి వంద మంది ఆడపిల్లలకు 109.6 మంది మగపిల్లలు ఉన్నారని అంచనా. ఈ కారణంగానే అనేక మంది యువకులకు వివాహాలు కావటం లేదు. మంచి ఉద్యోగం, సంపద, రాబడి ఉన్నవారిని మాత్రమే అమ్మాయిలు ఎంచుకుంటున్నారని, వ్యవసాయంలో ఉన్నవారికి ఆలశ్యం అవుతోందని చెబుతున్నారు. జనాభా లెక్కలను 2027లో సేకరించనున్నందున వాటిని నిర్ధారించిన తరువాత మాత్రమే వాస్తవ పరిస్థితి వెల్లడి అవుతుంది. అప్పటి వరకు చెప్పేవన్నీ అంచనాలు మాత్రమే. ఉదాహరణకు 2025లో మన జనాభా 144 కోట్లని గతంలో అంచనా చెప్పారు. ఇప్పుడు 146.39 కోట్లంటున్నారు. ఆడపిల్లల పట్ల వివక్ష, లింగ నిర్ధారణ పరీక్షలు చేయించి అబార్షన్లు చేయించటం వంటి దుర్మార్గం జరుగుతున్న కారణంగా బేటీ బచావో పథకాన్ని 2015 జనవరి 22న ప్రవేశపెట్టారు గానీ ఆచరణలో అలాంటి వాటిని ఆపేందుకు నిర్దిష్ట చర్యలు మాత్రం తీసుకోలేదు. స్త్రీపురుష అంతరం తగ్గకపోగా మరింతగా పడిపోవటానికి కారణం ఏమిటో ప్రధాని లేదా ఆయన మద్దతుదారులు చెప్పాలి.

> **కేంద్రంలోనూ, మెజారిటీ రాష్ట్రాలలో మేము, మా మిత్రులం ఉన్నాం... అని చెబుతున్న నరేంద్ర మోడీ గుజరాత్ సిఎంగా అనుభవం ఉన్నప్పటికీ మెకెన్సీ నివేదిక చెప్పిందేమిటో అర్థం కాలేదా? లేక వారేమిటి మాకు చెప్పేది అని ఖాతరు చేయలేదా? ఇంతవరకు స్త్రీపురుష అంతరం, ఆర్థిక అసమానతల తగ్గింపుకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? మోడీ విజయ గీతాలాపనలో తలమునకలుగా ఉన్న మీడియాలో ఎక్కడా దీని ప్రస్తావన కనిపించదు, వినిపించదు. 2014లో ప్రపంచ ఆర్థిక వేదిక విడుదల చేసిన నివేదిక ప్రకారం లింగ అంతరంలో 142 దేశాల్లో మన స్థానం 114, వచ్చిన పాయింట్లు 0.6455 కాగా అదే సంస్థ విడుదల చేసిన 2025 నివేదికలో 148 దేశాలకు గాను 131వ స్థానంలో ఉన్నాం, వచ్చిన మార్కులు 0.644, గతం కంటే తగ్గాయి.**

స్త్రీపురుష అంతరంలో ఆడపిల్లలు బతికి బట్టకట్టటాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటారు, ఈ పథకంలో బేటీ బచావో అన్నా అదే. అందుకే ఈ పథకం వైఫల్యం కూడా అంతరం మరింతగా పతనం కావటానికి దోహదం చేసిందని చెప్పాల్సి వస్తోంది. ఈ పథకానికి కేటాయించిన నిధులతో నరేంద్రమోడీ బొమ్మతో ప్రచారానికే ఎక్కువ ఖర్చు చేశారు. ఏడాదికి రెండు పాయింట్ల చొప్పున మెరుగుదల సాధించాలన్నది లక్ష్యం. అది జరిగినట్లు కనిపించటం లేదు. మహిళా సాధికారతపై పార్లమెంటరీ కమిటీ 2021 సమీక్షలో ఈ పథకానికి కేటాయించిన సొమ్ములో కేవలం 25.13 శాతమే ఖర్చు చేసినట్లు, వాటిలో కూడా 80 శాతం ప్రకటనలకే వెచ్చించినట్లు, ప్రత్యేకించి పంజాబ్, హర్యానాలతో పాటు అనేక రాష్ట్రాలలో పథక లక్ష్యాలు నెరవేరలేదని కూడా తేలింది. కాగ్ నివేదికలు కూడా దీన్నే సూచించాయి. పదేళ్లు దాటుతున్నా దీని అమలు గురించి సర్వేలే చేయలేదు. 2019లో ప్రభుత్వమే పార్లమెంటుకు ఈ విషయాన్ని చెప్పింది.

2024 లింగ అంతరం నివేదిక ప్రకారం పురుషుడు రూ.100 సంపాదిస్తే అదే పనికి మహిళకు ఇస్తున్నది రూ.39.80 మాత్రమే. ఇది చిన్న చిన్న ఉపాధి, ఉద్యోగాలకే కాదు, టెక్నాలజీ, క్రీడలు, సినిమా రంగాల్లో కూడా ఇదే పరిస్థితి అంటే అతిశయోక్తి కాదు. ప్రముఖ హీరోయిన్ దీపికా పదుకొనే 2021 ఆగస్టులో ప్రతిఫల చెల్లింపులో వివక్షను ప్రశ్నించారు. తన భర్త రణవీర్ సింగ్ ఎంత కష్టపడతారో తానూ అదే చేస్తానని తనకు తక్కువ మొత్తం ఇవ్వచూపినందుకు సంజయ్ లీలా భన్సాలీ సినిమా బైజు బావరాలో నటించేందుకు తిరస్కరించినట్లు ఆమె బహిరంగంగా చెప్పారు. ఆమె ఒక స్థాయికి ఎదిగారు గనుక అలా చెప్పగలిగారు, ఎందరికి అలాంటి అవకాశం ఉంది! నిజానికి ఇది బాలీవుడ్‌లోనే కాదు. దేశంలోని అన్ని సినిమా రంగాల్లో, ఇతర చోట్ల ఉంది. హాకీలో పది రెట్లు ఉన్నట్లు ఫెమినిజమ్ ఇండియా నివేదిక అదే ఏడాది పేర్కొన్నది. మన దేశ శ్రమశక్తి మార్కెట్‌లో వేతన వ్యత్యాసం పెద్ద సమస్యగా ఉంది. నరేంద్ర మోడీ తన మన్ కీ బాత్‌లో ఎన్నడూ దీని గురించి ప్రముఖంగా ప్రస్తావించినట్లు, తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎక్కడా కనిపించదు.

ఉద్యోగాల్లో చేరటంలో ఒకే స్థాయిలో 46 శాతం ఉన్నప్పటికీ సి.ఇ.ఓ.సి.ఎఫ్.ఓ, సిఓఓ వంటి ఉన్నత స్థానాల్లో 25 శాతానికి మించి మహిళలు లేరని కెపిఎంజి, ఏఐఎంఏ 2024 సర్వేలో తేలింది. అసంఘటిత రంగంలో పని చేస్తున్న వారిలో మహిళలే ఎక్కువగా ఉన్నప్పటికీ వారికి సమాన వేతనాలు లేకపోవటం, ప్రసూతి సెలవు వంటి సామాజిక భద్రత లేని విషయం తెలిసిందే. శ్రామిక మహిళలకు 26 వారాల ప్రసూతి సెలవు ఇవ్వాలనే చట్ట సవరణ తరువాత అనేక మంది యజమానులు పిల్లల్ని కనే వయస్సులో ఉన్నవారిని పనిలో పెట్టుకోవటం తగ్గించటం లేదా రాజీనామా చేయించి తరువాత చేర్చుకోవటం వంటి పనులకు పాల్పడిన ఉదంతాలు ఉన్నాయి. ఒకవైపు పురోగమనంలో ఉన్నామని చెబుతూ మహిళలను అణచివేసిన సనాతన ధర్మాన్ని, మనువాదాన్ని తలకెత్తుకుంటున్న శక్తులు రెచ్చిపోతున్న తరుణంలో పురుషులతో సమంగా స్త్రీలను చూసేందుకు అంగీకరిస్తారా !

**మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :**
**editpageps @ gmail.com**

# పాలస్తీనాకు సంఘీభావం




ఇజ్రాయిల్ నరమేధాన్ని నిరసిస్తూ బీహార్, పంజాబ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాల ఆధ్వర్యాన పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలు

## ఒడిశా లో కాలేజి విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

- 10 మంది అనుమానితులు అరెస్ట్

**భువనేశ్వర్ :** ఒడిశా లోని గంజాం జిల్లా గోపాలరావ్ బీచ్ లో కాలేజి విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి దుండగులు పాల్పడ్డారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో 10 మంది అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలు ఒక ప్రైవేటు కాలేజిలో డిగ్రీ చదువుతుంది. రాజా ఫెస్టివల్ సందర్భంగా తన స్నేహితుడితో కలిసి బీచ్ కి వెళ్ళిన సమయంలో అగంతుకులు స్నేహితుడిని నిర్భంధించి, దాడి చేసి యువతిని నిర్మానుష్య ప్రాంతానికి లాక్కెల్లి అత్యాచారం చేశారని పోలీసులు మీడియాకు తెలిపారు. పోటోలు తీసి నెట్‌లో పెడతాయని ఈ ముఠా బెదిరించింది. రాత్రి 12 గంటల సమయంలో వారి నుండి తప్పించుకున్న బాధితులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మంగళవారం నిందితులు పారిపోతుండగా పట్టుకున్నామని, విచారణ జరుపుతున్నామని బరంపూర్ ఎస్‌పి శరవణ వివేక్ తెలిపారు. ఈ అత్యాచార ఘటనపై జాతీయ మహిళా కమీషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ స్పందించారు. సుమోటాగా కేసు నమోదు చేశారు. 3 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని డిజీపికి లేఖ రాశారు.

## కిడ్నాప్‌కు భారత్ కుట్ర

- లండన్ హైకోర్టులో మెహుల్ చోక్సీ కేసు

**న్యూఢిల్లీ :** తనను కిడ్నాప్ చేయడానికి హింసించడానికి భారత్ కుట్ర చేసిందని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను దోచిన మెహుల్ చోక్సీ ఆరోపించారు. ఇదే విషయంపై చోక్సీ తరుపు న్యాయవాదులు లండన్ కోర్టులో కేసు వేశారు. భారత్ ప్రభుత్వం సహా ఐదుగురు వ్యక్తులపై కేసు వేశారు.

## విశాఖ వేదికగా.. డైవర్షన్ యోగా

(మొదటి పేజీ తరువాయి)

సన్నాహాలు చేస్తున్నాయి.

**పూటకో ఫార్మేట్‌తో ఉద్యోగులు బెంబేలు**

విశాఖ పోర్టు, నాల్కో, స్టీల్‌ప్లాంట్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ సహా జిల్లా కలెక్టరేట్, ఇతర రాష్ట్ర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగుల కదలికలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెలరోజులుగా నిఘా పెట్టాయి. ఎవరు ఎక్కడ యోగాలో పాల్గొంటున్నారో రోజువారీ గూగుల్ మ్యాప్‌లు, ఫార్మేట్‌లను నింపి అందరి వివరాలు పంపాలంటూ ఆదేశాలు జారీ చేశాయి. దీంతో ఉద్యోగులంతా సతమతమవుతున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలు, ముఖ్యంగా విశాఖ జిల్లాలో ప్రైవేట్ స్కూళ్ల వాహనాల వివరాలను జిల్లా అధికారులు రప్పించుకుంటున్నారు. ఒక ప్రైవేట్ స్కూల్ నుంచి ఇద్దరు టీచర్‌లు, ఒక ఫిజికల్ ట్రైనింగ్ టీచర్, 25 మంది పిల్లలు చొప్పున రావాలని జిల్లా విద్యాశాఖ డైరెక్షన్ ఇచ్చింది. రిజిస్ట్రేషన్ ఎంతమంది అయ్యారు ? మిగిలిందెంత ? అన్న విషయాలపై ఆరా తీస్తున్నారు. వార్డులు, గ్రామాల్లో ప్రజల రిజిస్ట్రేషన్‌ల వివరాల బాధ్యత ప్రభుత్వ శాఖలపైనే పడడంతో చాలామంది ఉద్యోగులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. 'మాకేంటీ 'కర్మ'యోగ' అంటూ విసుక్కుంటూ వాట్సాప్ గ్రూప్‌ల నుంచి లెఫ్ట్ అవుతున్న పరిస్థితులూ కొనసాగుతున్నాయి. యోగాసనాల అభ్యాసన నివేదికలను గూగుల్ మ్యాప్‌లు, సిసి పుటేజీలతో సహా రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖకు క్షణ క్షణం పంపాలన్న ఆదేశాలు పీక మీద కత్తిలా ప్రభుత్వ శాఖలకు పరిణమించాయి. దీంతో పలు శాఖలకు చెందిన సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

**అంచనా ఖర్చు రూ.62 కోట్లు**

యోగా డే వేడుకల నిర్వహణకు రూ.62 కోట్లు ఖర్చు కానున్నట్టు అధికార యంత్రాంగం అంచనా వేసింది. ఈ క్రమంలో తొలి విడతగా రూ.20 కోట్లను విడుదల చేస్తూ ఇప్పటికే ప్రభుత్వం జిఒ జారీ చేసింది. ఒక్క రోజు వేడుకకు ఇంత పెద్ద మొత్తంలో ప్రజా ధనాన్ని ఖర్చు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## పోలీసుల అదుపులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

స్టేట్‌మెంట్ ఇవ్వనని చెప్పినందుకు తనను బెదిరించి కొట్టారని, దెబ్బలు భరించలేక ఆస్పత్రిలో వైద్యం చేసుకుంటున్నారని' డిజిపికి చెవిరెడ్డి గన్‌మెన్‌గా పనిచేసిన ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్‌రెడ్డి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే మదన్‌రెడ్డి ఆరోపణలను సిట్ అధికారులు కొట్టిపారేశారు. తమ పారదర్శకతను నిరూపించుకోవడానికి డిజిపిని ఓ సీనియర్ అధికారితో ఉన్నతస్థాయి విచారణ చేయించాలని కోరతామని సిట్ ఓ ప్రకటనలో పేర్కొంది. లిక్కర్ స్కామ్‌లో తన తండ్రిని ఇరికించే కుట్రలు జరుగుతున్నాయని చెవిరెడ్డి కుమారుడు, వైసిపి నాయకులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు.

# నెత్తురోడిన ఆహార కేంద్రం !

- 70మందికి పైగా పాలస్తీనియన్ల మృతి
- వందలాదిమందికి గాయాలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- డ్రోన్లు, ట్యాంకులు, మెషిన్ గన్‌లతో దాడులు



ఆహార కేంద్రం వద్ద తీవ్రంగా గాయపడిన బాధిత బాలుడికి దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నాజర్ ఆసుపత్రిలో చికిత్స చేస్తున్న వైద్యులు

గాజా : నెలల తరబడి ఆహారం లేకుండా మాడిపోతున్న పాలస్తీనియన్లకు ఆహారం అందించేందుకే కేంద్రాలు తెరిచామని పైకి ప్రచారం చేస్తున్నా వాస్తవానికి ఆ ఆహార కేంద్రాలే మృత్యు కుహరాలుగా మారుతున్నాయి. గాజావ్యాప్తంగా దాడులకు తెగబడుతున్న ఇజ్రాయిల్ ప్రత్యేకించి ఆహార కేంద్రాలకు వచ్చే వారిని లక్ష్యంగా చేసుకుని ట్యాంకులు, శతఘ్నులతో, మెషిన్ గన్‌లతో, డ్రోన్లతో ఇజ్రాయిల్ దాడులకు తెగబడుతోందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తాజాగా మంగళవారం జరిగిన అటువంటి దాడుల్లో 70మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. వందలాదిమంది గాయపడ్డారు. గాజా వ్యాప్తంగా జరిగిన దాడుల్లో మృతి చెందిన వారితో కలిపి 89కి మృతుల సంఖ్య పెరిగిందని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. రఫా, ఖాన్ యూనిస్ నగరాల మధ్య నిర్వహిస్తున్న ఆహార పంపిణి కేంద్రానికి ప్రజలు వెళుతున్న సందర్భంగా ఈ దాడి చోటు చేసుకుంది. గాయపడిన వారిలో చాలామంది పరిస్థితి ఆందోళనకరంగా వుండడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నామని నాజర్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. దాదాపు 200మందికి పైగా గాయపడ్డారని గాజా పౌరరక్షణ దళ ప్రతినిధి మహ్మద్ బసల్ తెలిపారు. "ముందుగా డ్రోన్లతో పౌరులపై దాడి జరిగింది. కొద్ది నిముషాల వ్యవధిలోనే ఇజ్రాయిల్ ట్యాంకులు పలు తూటాల గుళ్ల వర్షంలా కురిపించాయి. ఆ కాల్పుల్లో అనేకమంది చనిపోయారని ఆ ప్రతినిధి చెప్పారు. తమ ఆకలి తీర్చే ఆహారం ఏదో దొరుకుతుందనే ఆశతో అక్కడికి వచ్చిన వారిపై ఇటువంటి క్రూరమైన దాడులు జరపడాన్ని అంతర్జాతీయంగా అన్ని దేశాలు ఖండిస్తున్నా ఇజ్రాయిల్ తన తీరు మార్చుకోవడం లేదు. ఇజ్రాయిల్ దాష్టికానికి ఇదొక నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జిహెచ్‌ఎఫ్ కేంద్రాల్లో ఇప్పటివరకు జరిగినదాడుల్లో ఇదే అత్యంత దారుణమైనదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సోమవారంనాటి దాడుల్లో 38మంది మరణించారు. ఇప్పటివరకు ఇలా జరిగినదాడుల్లో 300మందికి పైగా మరణించగా, 2వేల మందికి పైగా గాయపడ్డారు.

చనిపోయిన వారితో, గాయపడినవారి ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా బీభత్సంగా తయారైందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. అక్కడ నుండి పారిపోవడానికి ప్రయత్నిస్తున్నవారిపై కనికరం లేకుండా సైనికులు కాల్పులు జరపడం కనిపిస్తూనే వుందన్నారు. ఈ దాడుల్లో ముక్కలు ముక్కలుగా శరీరాలు ఛిద్రమవడంతో ఎవరినీ గుర్తు పట్టే పరిస్థితి లేదని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి.

## తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు
# సుగుణమ్మ కన్నుమూత

- సిపిఎం, సిపిఐ నాయకుల సంతాపం
- 19న మహాప్రస్థానంలో అంతక్రియలు



**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, భారత కమ్యూనిస్టు పార్టీ మహిళా సమాఖ్య నాయకురాలు శాఖమూరి సుగుణమ్మ (91) సోమవారం అర్ధరాత్రి కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో కనున్నమూశారు. ఆమె మరణ వార్త తెలిసిన వెంటనే మంగళవారం ఉదయం సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతోపాటు సిపిఎం నాయకులు ఆమె భౌతికకాయంపై పార్టీ జెండా ఉంచి పుష్పాంజలి ఘటించారు. సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, ఫౌండేషన్ ట్రెజరర్ వి.చెన్నకేశవరావు, సిఆర్ పాలీ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ రజిని, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జోస్యబట్ల కల్పన, మహిళా సమాఖ్య నాయకులు ప్రేం పావని, డాక్టర్ నారాయణరావు, వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యులు, వృద్ధాశ్రమ వాసులు, సిబ్బంది, తదితరులు సుగుణమ్మ మృతదేహానికి నివాళి అర్పించారు. అమెరికాలో ఉంటున్న సుగుణమ్మ కుమార్తె డాక్టర్ శాఖమూరి శోభ, కుమారులు డాక్టర్ శాఖమూరి రవి, శాఖమూరి రమేష్ బుధవారం రాత్రికి హైదరాబాద్ చేరుకోనున్నారు. 19న సాయంత్రం నాలుగు గంటలకు ఫిలింనగర్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

**సుగుణమ్మ మృతికి ఐద్వా సంతాపం**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న వీర వనిత సుగుణమ్మ మృతికి ఎపి ఐద్వా రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. భర్త ప్రసాద్‌తో కలిసి వీర తెలంగాణ పోరాటంలో, అనంతరం విప్లవోద్యమంలో చురుకుగా పాల్గొన్నట్లు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుగుణ సోషలిస్టు ఆశయాల కోసం చివరి వరకూ పని చేశారని కొనియాడారు.

**సుగుణమ్మ సేవలు ఎనలేనివి: సిపిఐ**

సుగుణమ్మ మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సంతాపం తెలిపారు. సిపిఐ, మహిళా సమాఖ్య నాయకురాలిగా పార్టీకి, మహిళా సమాఖ్యకు సుగుణ అందించిన సేవలు ఎనలేనివనిఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను నివారించాలి

- జి 7 నేతల పిలుపు
- ఇజ్రాయిల్‌కు వత్తాసు
- ఇరాన్ ఎన్నటికీ అణ్వాయుధాలను కలిగి వుండరాదని స్పష్టీకరణ

**కనానాస్కిస్ :** ఇరాన్ మిలటరీ, అణు స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయిల్ ముందస్తు దాడులు జరిపిన నేపథ్యంలో పశ్చిమాసియాలో పెచ్చరిల్లిన ఉద్రిక్తతలను నివారించాలని జి-7 దేశాలు పిలుపునిచ్చాయి. ఇరాన్ ఎన్నటికీ అణ్వాయుధాలను కలిగి వుండరాదని స్పష్టం చేస్తూ.. ఇజ్రాయిల్‌కు వత్తాసు పలికాయి. మధ్యప్రాచ్యంలో శాంతిని నెలకొల్పాల్సిన తక్షణావశ్యకత వుందని పేర్కొంటూ జి 7 దేశాల నేతలు సంయుక్త ప్రకటన చేశారు.

కెనడాలోని కనానాస్కిస్‌లో జరుగుతున్న ఈ సదస్సుకు హాజరైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అర్ధంతరంగా వెళ్లిపోయారు. ఇరాన్ అణు కార్యక్రమంపై తన వైఖరిని జి-7 పునరుద్ఘాటించింది. ఇరాన్ ఎన్నటికీ అణ్వాయుధాలను కలిగివుండలేదని స్పష్టం చేస్తూ, ఇజ్రాయిల్‌కు ఆత్మ రక్షణ హక్కు వుందంటూ సమర్ధించింది. ఇజ్రాయిల్ భద్రతకు తమ మద్దతు వుంటుందని పేర్కొంది. ప్రాంతీయ అస్థిరతకు, భయోత్పాతానికి ప్రధాన వనరు ఇరాన్ అని పేర్కొనడం గమనార్హం. ఇరాన్ సమస్యను త్వరగా పరిష్కరిస్తే గాజాలో కాల్పుల విరమణతో సహా మొత్తంగా పశ్చిమాసియాలో పరిస్థితులు చక్కబడతాయని సదస్సు పేర్కొంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో తలెత్తే పర్యవసానాల పట్ల అప్రమత్తంగా వుంటామని, మార్కెట్ స్థిరత్వాన్ని పరిరక్షించుకునేందుకు భావ సారూప్య భాగస్వాములతో కలిసి సమన్వయంతో సహకరించుకుంటామని జి 7 నేతలు పేర్కొన్నారు.

# పేలుళ్లతో దద్దరిల్లిన టెహ్రాన్, టెల్ అవీవ్

**టెల్ అవీవ్, టెహరాన్ :** పేలుళ్లతో టెహరాన్, టెల్ అవీవ్ మార్మోగాయి. సెంట్రల్, ఉత్తర టెహరాన్‌ల్లో రెండు భారీ పేలుళ్లు జరిగిన శబ్దాలు వినిపించాయి. ఇరాన్ మిలటరీ, అణు స్థావరాలే లక్ష్యంగా ఆకస్మికంగా దాడులు మొదలు పెట్టిన ఇజ్రాయిల్ ఐదు రోజుల నుండి రాజధాని టెహరాన్‌పై దాడులను విస్తరిస్తూ వస్తోంది. పశ్చిమ ఇరాన్‌లో పలుచోట్ల యుద్ధ విమానాలతో బాంబుల వర్షం కురిపించింది. టెహరాన్ విమానాశ్రయమే లక్ష్యంగా దాడులకు దిగింది.

అక్కడ గల రెండు ఎఫ్-14 యుద్ధ విమానాలు ఈ దాడుల్లో ధ్వంసమైన దృశ్యాలను ఐడిఎఫ్ విడుదల చేసింది. ఇరాక్ నేత సద్దాం హుస్సేన్‌కు ఎలాంటి గతి పట్టిందో ఇరాన్ గుర్తుంచుకోవాలని ఇరాన్ మత పెద్ద ఆయతుల్లా అలీ ఖమేనిని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ హెచ్చరించారు. ఇజ్రాయిల్ మిలటరీ, సెక్యూరిటీ సర్వీస్ కమాండర్లతో సమావేశం సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు.

తాజా దాడుల్లో ఇరాన్ కొత్త వార్‌టైమ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్, ఇరాన్ మత పెద్ద ఖమేనికి కీలకమైన సన్నిహిత సలహాదారైన అలీ షాద్మాని మరణించినట్లు ఇజ్రాయిల్ వర్గాలు తెలిపాయి. సెంట్రల్ టెహరాన్‌లోని ఒక రహస్థ స్థావరంలో దాగి వుండగా సమాచారం తెలుసుకుని దాడి జరిపినట్లు పేర్కొన్నాయి. ఈ ఐదు రోజుల దాడుల్లో ఇరాన్ పలువురు కీలకమైన సైనికాధికారులను కోల్పోయింది.



ఇజ్రాయిల్ దాడులతో టెహ్రాన్‌లో చెలరేగుతున్న మంటలు

**టెల్ అవీవ్ నగరంపై క్షిపణులతో దాడులు**

ఇరాన్ కూడా ఇజ్రాయిల్ దాడులను దీటుగా ఎదుర్కొంటోంది. బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడుతోంది. మంగళవారం దాదాపు 20 క్షిపణులు టెల్ అవీవ్ నగరంపై పడ్డాయని ఇజ్రాయిల్ దళాలు వెల్లడించాయి. ఇజ్రాయిల్ గూఢచారి సంస్థ మొస్సాద్ కేంద్ర కార్యాలయంపై బాంబుల వర్షం కురిపించింది. ఈ మేరకు ఇరాన్ మీడియా పేర్కొంది. ఇజ్రాయిల్ మిలటరీ ఇంటెలిజెన్స్ భవన సముదాయంపైనా క్షిపణులతో దాడి చేసినట్లు మీడియా వెల్లడించింది. ఇజ్రాయిల్ పక్కా లక్ష్యాలపై దాడులు చేయడానికి వెనుక వున్నది మొస్సాద్ గూఢచారి సంస్థేనని భావించిన ఇరాన్ ముందుగా ఆ సంస్థ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగింది. తబ్రిజ్ నగరంలో ఇజ్రాయిల్‌కు చెందిన ఎఫ్-35 యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఇప్పటివరకు నాలుగు యుద్ధ విమానాలను కూల్చివేసినట్లు ఇరాన్ బలగాలు ప్రకటించాయి. తబ్రిజ్ చుట్టూ మూడు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నారని, ఇజ్రాయిల్ నుండి వస్తున్న మైక్రో ఎయిర్ వెహికల్స్ (ఎంఎవి)లను విజయవంతంగా అడ్డుకున్నట్లు తెలిపాయి. ఘర్షణల కారణంగా జెరూసలేంలోని అమెరికా రాయబార కార్యాలయాన్ని మూసివేశారు. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సురక్షిత ప్రాంతాలలో ఉండాలని కార్యాలయం సూచించింది. దేశాన్ని వదిలి పెట్టాలని కోరుకుంటున్న అమెరికన్లను ఖాళీ చేయించే పరిస్థితిలో కానీ, వారిని నేరుగా సాయం అందించే పరిస్థితిలో కానీ రాయబార కార్యాలయం లేదంటూ నిస్సహాయత వ్యక్తం చేసింది.

# రెండు నెలల్లో సర్క్యులర్ ఎకానమీ పాలసీ

(మొదటి పేజీ తరువాయి)

అవార్డులు వచ్చే ఏడాది అక్టోబర్ 2 నుండి ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. స్థానిక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, ఆస్పత్రులు, ఎన్‌జిఓలు, వివిధ ఆర్గనైజేషన్ల వారీగా అవార్డులు ఇవ్వాలని నిర్దేశించారు.

**ప్లాస్టిక్ రహిత నగరాలు**

ఈ ఏడాది అక్టోబర్ 2 నుండి రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రితోపాటు 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా అరికట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ నగరాల్లో క్లాత్ బ్యాగుల వినియోగాన్ని పెంచాలన్నారు. 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస్ రీ యూజ్, రీసైకిల్(ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు.

**రూ.15 వేల కోట్ల అదనపు ఆదాయం**

సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థను సమర్ధంగా అమలు చేస్తే జిఎస్‌డిపికి అదనంగా రూ.15,000 కోట్లు కలుస్తుందని అంచనా వేసినట్లు సిఎం తెలిపారు. మరో రూ.10 వేల కోట్ల విలువైన మెటీరియల్‌ను ఉత్పత్తి రంగానికి సరఫరా చేసే అవకాశం ఉంటుందని, ఈ విలువ జోడింపుతో రాష్ట్రం జిఎస్‌టి రూపంలో రూ.3,000 కోట్లు ప్రతి ఏటా ఆర్జించవచ్చని తెలిపారు. మరోవైపు ప్రత్యక్షంగా లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయని, పదివేల మైక్రో ఎంటర్ ప్రెన్యూర్లకు ఉపాధి లభిస్తుందని వివరించారు. దీంతోపాటు పరోక్షంగా 10 లక్షల మందికి ఉపాధి కలుగుతుందని, పర్యావరణ పరిరక్షణ సాధ్యమై కర్బనాల విడుదల తగ్గుతుందని తెలిపారు. భూ, జల, వాయు కాలుష్యాన్ని గణనీయంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు.

**జీవన సౌరభం**

మన లోపాలను మనం గ్రహించడం అన్నింటికన్నా గొప్ప చదువు.

**మీకోసం**

బియ్యం పురుగు పట్టకుండా ఉండాలంటే అందులో నాలుగు ఎండు మిరపకాయలు వేసి ఉంచాలి.





## భేదభావం వద్దే వద్దు



కలిసి మెలగడమే సంతోషం

ఎక్కువ తక్కువ తోసేద్దాం
మక్కువతోనే అడుగేద్దాం
హెచ్చు తగ్గులు చెరిపేద్దాం
ఎంచక్కా కలిసి ఆడుకుందాం

భేదభావం దూరం దూరం
అందరూ ఒక్కటే సమానం
పంచభూతాల సమన్వయం
అవే కదా మనకు ఆదర్శం

ఐకమత్యమై కదులుదాం
ఒకే త్రాటిపై అడుగేద్దాం
ఒకరికి ఒకరం తోడవుదాం
ఏకపక్షంగా బ్రతుకుదాం

స్నేహమంటే ఎంతో మధురం
కలిసి వుండుటే మహా బలం
మెలిసి తిరిగితే ఘన యోగం
మమతే మనిషికి ఆనందం

విడనాడాలి తారతమ్యం
కలుపుకుపోవడమే ధర్మం
కలిసి బ్రతకడమే మానవత్వం

– నరెద్దుల రాజారెడ్డి,
96660 16636.

## నేను గీసిన బొమ్మ




జి.సాయి శిరీషా బాయ్,
8వ తరగతి,
శ్రీచైతన్య హైస్కూల్,
కర్నూలు.



## ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.




పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



## వారానికి ఎన్ని గుడ్లు తినాలంటే!

అన్ని వయసుల వారు గుడ్డును ఆరోగ్యకరమైన ఆహారంగా పరిగణిస్తారు. ప్రొటీన్లు పుష్కలంగా ఉండే గుడ్లలో విటమిన్లు, ఒమేగా–3 ఫ్యాటీ ఆమ్లాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. అయితే, రోజుకు ఎన్ని గుడ్లు తినొచ్చు అనే విషయంలో చాలామందికి సందేహాలు ఉంటాయి. ఆరోగ్యం, వయసు, బరువు, లింగం, శారీరక శ్రమ తదితర అంశాల మీద ఇది ఆధారపడి ఉంటుంది.

**తెల్లసొన మాత్రమే**

గుండెజబ్బుల ముప్పు ఉన్నవాళ్లు పచ్చసొన విడిచిపెట్టి తెల్లసొన మాత్రమే తినాలి. గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్, అధిక ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్ స్థాయిలు ఉన్నవాళ్లు మాత్రం వారానికి ఏడు (అంటే రోజుకు ఒకటి చొప్పున) గుడ్లు తినొచ్చు.

**పోషకాల గని**

ఓ మోస్తరు గుడ్డు 5 గ్రాముల ఆరోగ్యకరమైన అన్‌శాచురేటెడ్ ఫ్యాట్, 6 గ్రాముల నాణ్యమైన ప్రొటీన్, విటమిన్ డి, విటమిన్ బి, 186 మిల్లీగ్రాముల కొలెస్ట్రాల్‌తోపాటు మెదడు పనితీరును మెరుగుపరిచే ముఖ్యమైన పదార్థం కోలిన్‌ను కలిగి ఉంటుంది. ఇక గుడ్డు పచ్చసొన విటమిన్లు, మినరల్స్, ఆరోగ్యకరమైన కొవ్వులకు గని.

**అవసరం ప్రధానం**

ఇక రోజుకు ఎన్ని గుడ్లు తినాలనేది ఆరోగ్యం, ఆహార అవసరాల మీద ఆధారపడి ఉంటుంది. ఆరోగ్యవంతులు రోజుకు 1 నుండి 3 గుడ్లు తినొచ్చు. చురుకైన జీవనశైలి కలిగిన వాళ్లు, అథ్లెట్లు 2 నుండి 4 గుడ్ల వరకు తీసుకోవచ్చు.


**మహిళల ఆరోగ్యంలో**

మహిళలు రోజుకు 1 నుంచి 2 గుడ్లు తినడం మంచిది. గర్భధారణ సమయం, మెనోపాజ్ దశలో ఉన్నవాళ్ల ఎముకల ఆరోగ్యానికి గుడ్డులో ఉండే విటమిన్ డి సహాయకారిగా ఉంటుంది. పచ్చసొన తింటే ఐరన్, ఫోలేట్ లభిస్తాయి.

**వారంలో ఎన్ని?**

వారానికి ఏడు గుడ్లు తినడం మంచిది. కాకపోతే, టైప్ 2 డయాబెటిస్, అధిక హెచ్‌డీఎల్ (చెడు) కొలెస్ట్రాల్, గుండెజబ్బులు ఉన్నవాళ్లు మాత్రం గుడ్డు తెల్లసొననే తీసుకోవాలి. మెటబాలిక్ సిండ్రోమ్స్ ఉన్నవాళ్లయితే వారానికి 6 గుడ్ల వరకు తీసుకోవచ్చు. అయితే గుడ్లు ఎంత ఆరోగ్యకరమైనా తాజా పండ్లు, కూరగాయలు, హోల్ గ్రెయిన్స్, లీన్ (తేలికపాటి) ప్రొటీన్లతో కలిపి వాటిని తీసుకోవాలి.

## నిమ్మతొక్కలతో ఇలా చేయండి..



నిమ్మ తొక్కల నుంచి రసం తీయగానే వాటిని పడేస్తుంటాం. కానీ ఆ తొక్కల వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. చర్మ సౌందర్యాన్ని పెంచడంలోనూ, వస్తువుల్ని శుభ్ర పరచడంలోనూ ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి.

- తుప్పు పట్టిన తీగల మీద బట్టలను ఆరవేసినప్పుడు లేదంటే బట్టలకు ఉన్న హుక్స్ తుప్పుపట్టినప్పుడు బట్టలకు తుప్పు అంటుకుంటుంది. ఆ తుప్పు మరకలు పోవాలంటే మరకల మీద నిమ్మతొక్కలతో గాని ఉప్పు కలిపిన రసంతో కాని రుద్ది ఎండలో వేయాలి.
- నిమ్మకాయ చెక్కలతో తలరుద్దుకుని వేడినీళ్లతో స్నానం చేస్తే చుండ్రుపోతుంది.
- రసం తీసేసిన నిమ్మతొక్కలను స్నానం చేసే నీళ్లలో వేసి కాసేపు ఉంచి ఆ నీళ్లతో స్నానం చేస్తే శరీరం కాంతివంతంగా ఉంటుంది. గజ్జి, తామర వంటి చీడలు, చర్మవ్యాధులు దరిచేరవు.
- పాత్రలు అడుగంటినపుడు నిమ్మతొక్కలని చిన్నచిన్న ముక్కలుగా చేసి అందులో వేయాలి. ఆ తరువాత నీరుపోసి మరిగించాలి. చల్లారాక శుభ్రంగా కడిగితే మరకలు పోతాయి.
- నిమ్మచెక్కలతో రాగి వస్తువులను శుభ్రపరచుకోవచ్చు. ఉప్పులో ముంచిన నిమ్మచెక్కతో రుద్ది, వేడినీటితో కడిగి ఆపై పొడిబట్టలతో తుడవాలి.
- రసం తీసేసిన నిమ్మచెక్కలతో డైనింగ్ టేబుల్‌ను తుడిస్తే జిడ్డుపోయి శుభ్రంగా ఉంటుంది.
- అరటికాయలు తరిగాక చేతులు మరకలుగా, జిగురుగా చిరాగ్గా ఉంటాయి. అప్పుడు నిమ్మ తొక్కలతో చేతులు బాగా రుద్దుకుంటే సరిపోతుంది.
- నిమ్మతొక్కలతో రుద్దితే బట్టలపై పడిన గోరింటాకు మరకలు పోతాయి.
- రసం పిండేసిన నిమ్మతొక్కల్ని పారేయకుండా ఏదైనా జాడీలో వేసి సరిపడా ఉప్పువేసి ఉంచాలి. అలా జాడీ నిండేదాకా నిమ్మతొక్కల్ని వేసి, ఆఖరికి కాసిని మెంతులు, ఆవాలుపొడి, సరిపడా కారం, ఇంగువ వేసి నూనె కాచి పోపు పెడితే నిమ్మతొక్కలతో నిమ్మపచ్చడి రెడీ.
- రసం పిండేసిన నిమ్మతొక్కలతో వాష్ బేసిన్ రుద్దితే తెల్లగా ఉంటుంది.
- కొంతమంది మోచేతులు, మోకాళ్లు బాగా నల్లగా ఉండి గరుకుగా ఉంటాయి. అలాంటి వాళ్లు నిమ్మతొక్కలతో మోచేతులను మోకాళ్లను బాగా రుద్దితే చర్మం నునుపుగా, మృదువుగా ఉంటుంది.
- నిమ్మతొక్కలతో గోళ్లను బాగా రుద్దితే, గోళ్లు అందంగా, పుచ్చిపోకుండా ఉంటాయి.

## బురద మరకలను తొలగించండిలా...

వర్షాకాలంలో బట్టలపై పడే బురద మరకలను వదిలించుకోవడం ఓ సమస్య. అయితే కొన్ని చిట్కాలు పాటిస్తే ఆ పని సులువవుతుంది. అవేంటో తెలుసుకుందాం.

- తేలిగ్గా మృదువుగా ఉండే బట్టలపై బురద మరకలు ఏర్పడితే డిష్‌వాష్‌తో శుభ్రం చేయవచ్చు. వాటిపై ఒత్తిడి పడనీయకుండా చేతులతో రుద్ది శుభ్రం చేయాలి.
- వెనిగర్‌ని శుభ్రత విషయంలో పలు విధాలుగా వినియోగిస్తుంటాం. తెల్లని డిజిటల్ వెనిగర్, తెల్లని దుస్తులను మరింత తెల్లగా మారుస్తుంది, వానాకాలంలో దుస్తులమీద పడిన మట్టి మరకలను వదిలించడంలో కూడా బాగా పనిచేస్తుంది.
- బేకింగ్ సోడాలో వెనిగర్‌ని కలిపి ఉపయోగించినా మొండి మరకలను తొలగించుకోవచ్చు. నిమ్మరసం సైతం ఈ విషయంలో చక్కగా పనిచేస్తుంది. మరకలమీద నిమ్మతొక్కతో రుద్ది వాష్ చేయాలి.



## కర్ణాటకలో థగ్‌లైఫ్ విడుదల చేయాలి

- సుప్రీం కోర్టు ఆదేశాలు




**న్యూఢిల్లీ :** చిత్రాలను విడుదల చేసేందుకు నిర్మాతలు, థియేటర్ యజమానులకు గల హక్కులను హింస, దహనాల బెదిరింపులతో తగ్గించలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. కమల్ హాసన్ సినిమా థగ్ లైఫ్‌ను రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శించేలా కర్ణాటక ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించింది. "అల్లరి మూకలు, నిఘా బృందాలు మన వీధులను ఆక్రమించుకోవడానికి మనం అనుమతించరాదు. చట్టబద్ధ పాలన అమలు జరగాలి." అని జస్టిస్ ఉజ్జల్ భయాన్ స్పష్టం చేశారు. థగ్‌లైఫ్ చిత్రాన్ని కర్ణాటకలో కూడా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బెంగళూరు వాసి మహేష్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వెకేషన్ బెంచ్ విచారించి పై ఆదేశాలు జారీ చేసింది. థియేటర్లపై, చలన చిత్ర నిర్మాతలపై హింసను రెచ్చగొట్టిన, బెదిరింపులు చేసిన శక్తులపై చర్యలు తీసుకోవాలని కూడా పిటిషన్‌దారుడు కోరారు. చిత్ర ప్రమోషన్ సందర్భంగా కన్నడ భాషపై కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ చిత్రంపై నిషేధం విధించారు. ఎవరైనా స్టేట్‌మెంట్ ఇస్తే, మీరు కూడా ప్రతిగా స్టేట్‌మెంట్‌తో సమాధానం ఇవ్వండి, ఎవరైనా రాస్తే, అందుకు ప్రతిగా రాతతో బదులివ్వండి. అంతేకాని హింస, బెదిరింపులు, దహనాలు వంటి చర్యలకు దిగరాదు." అని జస్టిస్ భయాన్ వ్యాఖ్యానించారు. కర్టాణక హైకోర్టులో కమల్ హాసన్ దాఖలు చేసిన పిటిషన్‌ను బెంచ్ సుప్రీం కోర్టుకు బదిలీ చేసింది. కమల్ హాసన్ చేసిన ప్రకటనకు గానూ ఆయనను క్షమాపణలు అడిగే అవసరం హైకోర్టుకు లేదని జస్టిస్ భయాన్ పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై తన స్పందనను బుధవారానికి తెలియజేయాల్సిందిగా కర్ణాటక ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశించింది. గురువారానికి విచారణను వాయిదా వేసింది.



## వెబ్ సిరీస్‌గా..

కోలీవుడ్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు, సూర్య కాంబోలో వచ్చిన చిత్రం 'రెట్రో'. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించారు. ప్రస్తుతం ఈ చిత్రం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న డైరెక్టర్ కార్తీక్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. 'రెట్రో సినిమాలోని డిలీట్ చేసిన సీన్స్‌తో ఎక్స్‌టెండెడ్ వెర్షన్‌ను తీసుకురావాలని డిజిటల్ ఫ్లాట్‌ఫామ్‌తో చర్చిస్తున్నాను. నాలుగు నెలల తర్వాత దీన్ని సిరీస్ వెర్షన్‌ల్లో అందుబాటులోకి తీసుకురావాలని ఆలోచిస్తున్నాను. ఎన్నో భావోద్వేగాలతో కూడిన సన్నివేశాలు మరింత వివరంగా ఉండేలా ప్లాన్ చేస్తున్నా. ఇందుకోసం నెట్‌ఫ్లిక్స్‌తో చర్చలు జరుపుతున్నా. కానీ వారు ఇంట్రెస్ట్ చూపించడం లేదు. కొన్ని ఎపిసోడ్‌లుగా దీన్ని మీ ముందుకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాను. ఒక్కొక్కటి దాదాపు 40 నిమిషాలు ఉండేలా చూస్తున్నా. ఒక్కో ఎపిసోడ్‌లో ఒక్కో భావోద్వేగాన్ని హైలైట్ చేయాలని అనుకుంటున్నా' అని చెప్పారు.



## 11 నుంచి ఓటీటీలోకి 'ఆప్ జైసా కోయి'

ఆర్.మాధవన్ నటించిన 'ఆప్ జైసా కోయి' చిత్రం డైరెక్ట్‌గా ఓటీటీలో విడుదల కానుంది. బాలీవుడ్ నిర్మాత కరణ్ జోహార్ ఈ చిత్రాన్ని నిర్మించగా వివేక్ సోని దర్శకత్వం వహించారు. లవ్, కామెడీ డ్రామాతో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుందని మేకర్స్ అభిప్రాయపడ్డారు. ఇందులో కథానాయికగా ఫాతిమా సనా షేక్ నటించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా జులై 11 నుంచి అందుబాటులో ఉండనుంది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడలో విడుదల కానుంది. ఇద్దరు వేర్వేరు మనస్తత్వాల జోడీని ప్రపంచానికి చూపాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని నిర్మించారు. దంపతుల మధ్య పదేళ్ల గ్యాప్ ఉంటే ఎలాంటి చిక్కులు రావచ్చు.. వస్తే వాటిని ఎలా పరిష్కరించుకుంటారనేది ఈ చిత్రంలో చూపించనున్నారు.

## 'సన్ ఆఫ్ సర్దార్'లో మృణాల్




బాలీవుడ్ నటుడు అజయ్‌దేవ్‌గణ్ చిత్రంలో మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. హిట్ మూవీ సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'సన్ ఆఫ్ సర్దార్–2'లో తాను నటిస్తున్నట్లు తాజాగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆమె వెల్లడించారు. క్లాప్ కొడుతున్న ఫొటోని షేర్ చేశారు. ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. విజయ్ కుమార్ అరోరా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. దేవ్‌గణ్ ఫిల్మ్స్, జియో స్టూడియోస్ బ్యానర్‌పై జ్యోతి దేశ్‌పాండే, అజయ్ నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ నేపథ్యంలో రాబోతున్న ఈ మూవీలో సంజయ్ దత్, సాహిల్ మెహతా, సంజయ్ మిశ్రా, రవికృష్ణ కీలక పాత్రలో కనిపించనున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా జులై 25న విడుదల కాబోతున్నట్లు సమాచారం.

## పూరీ చిత్రంలో సంయుక్త

పూరీ జగన్నాథ్, విజయ్‌సేతుపతి కాంబోలో ఓ చిత్రం రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో నటిస్తున్న మరో నటిని తాజాగా చిత్రబృందం ప్రకటించింది. మలయాళ నటి సంయుక్త.. ఈ ప్రాజెక్ట్‌లోకి రానున్నట్లు పూరీ–ఛార్మీ ప్రకటించారు. ఆమెతో కలిసున్న ఫొటోని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. విజయ్ సేతుపతి మూవీలో ఇప్పటికే టబు, కన్నడ నటుడు దునియా విజయ్ ఉన్నట్లు గతంలో ప్రకటించారు. ఈ చిత్రంలో సేతుపతి బిచ్చగాడిగా కనిపించనున్నాడని తెలుస్తోంది. త్వరలో షూటింగ్ ప్రారంభించి ఈ ఏడాది చివర్లోనే రిలీజ్ చేయాలనే ప్లాన్ చేస్తున్నారని సమాచారం.



## పేసర్లపైనే భారం

- జట్టు కూర్పుపై సెలెక్షన్ కమిటీ కసరత్తు
- ఇంగ్లండ్‌తో తొలిటెస్ట్‌కు 18న తుదిజట్టు ప్రకటన



**లండన్:** ఇంగ్లండ్‌తో జరిగే తొలి టెస్ట్‌కు టీమిండియా జట్టు కూర్పుపై కసరత్తు మొదలైంది. తొలిటెస్ట్ జరిగే లీడ్స్ మైదానం పేసర్లకు సహకరించనున్న దృష్ట్యా తుదిజట్టులో కనీసం నలుగురు పేసర్లకు చోటు దక్కడం ఖాయంగా కనబడుతోంది. హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ కూడా తిరిగి ఇంగ్లండ్‌కు చేరుకోవడంతో జట్టు కూర్పుపై సెలెక్షన్ కమిటీ దృష్టి సారించింది. దీంతో ఈనెల 18న లేదా 19న తొలి టెస్ట్‌కు జట్టును ప్రకటించే ఛాన్స్ ఉందని, ఇందులో ఒకరిద్దరూ కొత్త ఆటగాళ్లకు కూడా చోటు దక్కడం ఖాయమని సమాచారం. తొలి టెస్ట్ ప్రారంభానికి మరో మూడ్రోజులు మాత్రమే ఉన్న దృష్ట్యా టీమిండియా ఆటగాళ్లంతా నెట్ ప్రాక్టీస్‌లో చెమటోడ్చుతున్నారు. గత నెల మే 24న 18మంది ఆటగాళ్లతో కూడిన భారతజట్టు ఇంగ్లండ్ పర్యటనకు బయల్దేరింది. టెస్టులకు గుడ్‌బై చెప్పిన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ పేర్లను సెలెక్షన్ కమిటీ పరిశీలించలేదు. దీంతో వారి స్థానంలో సాయి సుదర్శన్, కరణ్ నాయర్, శార్దూల్ ఠాకూర్ పోటీపడుతున్నారు. వీరితోపాటు ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన రెండు అనధికారిక టెస్టుల్లో రాణించిన ఆటగాళ్లను ఎంపికచేసిన ఆశ్చర్యపోన్నక్కర్లేదు.

**పరిశీలనలో ఐదుగురు పేసర్లు..**

ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్‌కు టీమిండియా ఐదుగురు పేసర్లతో బరిలోకి దిగినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అదే జరిగితే బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణలకు తుది జట్టులో చోటు దక్కడం ఖాయం. ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన సిరీస్‌లో రాణించిన ఆటగాల్లు, కౌంటీల్లో ఆడే ప్లేయర్స్, కౌంటీల్లో ఆడతామని ఒప్పందం కుదుర్చుకున్న అక్కడే ఉన్నారు. జట్టు ప్రకటన తర్వాత మిగిలిన ఆటగాళ్లంతా తిరిగి భారత్‌కు పయనమవుతారు. హర్షిత్ రాణా కూడా ఇంగ్లండ్‌లోనే ఉన్నాడు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణలను తొలిటెస్ట్‌కు ఎంపిక చేయడం ఖాయం.

శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా.. 2007 తర్వాత తొలిసారి ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్ గెలవాలన్న లక్ష్యంగా ఈ పర్యటనకు బయల్దేరి వచ్చింది. భారత్–ఇంగ్లండ్ జట్ల మధ్య హెడింగ్లీ, ఎడ్జ్‌బాస్టన్, లార్డ్స్, ఓల్డ్‌ట్రఫోర్డ్, ఓవల్ వేదికలుగా మొత్తం ఐదు టెస్ట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. 2025–27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యుటిసి) సైకిల్ కూడా ఈ సిరీస్‌తోనే ప్రారంభం కానున్న దృష్ట్యా ఇరుజట్లకు ఈ సిరీస్ విజయం కీలకంగా మారింది.

**బ్యాకప్ ప్లేయర్‌గా హర్షిత్ రాణా..**

తొలిటెస్ట్ ప్రారంభానికి ముందు బిసిసిఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఐపిఎల్, దేశవాళీ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శనతో సెలెక్టర్ల దృష్టిలో పడిన హర్షిత్ రాణాను బ్యాకప్ ప్లేయర్‌గా ఎంపిక చేసింది.

నిరుడు ఆస్ట్రేలియా పర్యటనతో టెస్టుల్లో అరంగేట్రం చేసిన హర్షిత్.. ఆడింది రెండు మ్యాచులే అయిన తనదైన పేస్‌తో కంగారూలను వణికించాడు. 23 ఏళ్ల రానా ఇప్పటివరకూ రెండు టెస్టులు, 5 వన్డేలు, ఒకే ఒక టి20 ఆడాడు. ఇంగ్లండ్ పర్యటనకు టీమిండియా–ఎ జట్టుతో పాటు వెళ్లిన అతడు రెండు అనధికార టెస్టుల్లో రాణించాడు. హర్షిత్ రాణా ట్రాక్ రికార్డు భేషుగ్గా ఉంది. 13 ఫస్ట్‌క్లాస్ క్రికెట్ మ్యాచుల్లో 27.79 సగటుతో సహా 48వికెట్లు పడగొట్టాడు. అలాగే బ్యాటింగ్‌లోనూ 32.80 సగటుతో ఒక సెంచరీ, రెండు అర్ధసెంచరీలను కూడా కొట్టాడు.

**టీమిండియా ఆటగాళ్ల జాబితా..**

**శుభ్‌మన్(కెప్టెన్), పంత్(వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరణ్ నాయర్, నితీశ్ రెడ్డి, జడేజా, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), సుందర్, శార్దూల్, బుమ్రా, సిరాజ్, ప్రసిధ్, ఆకాశ్‌దీప్, అర్ష్‌దీప్, కుల్దీప్.**

## టాప్‌లోకి మంధాన

- ఐసిసి వన్డే ర్యాంకింగ్స్



**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజాగా ప్రకటించిన మహిళల వన్డే బ్యాటర్ల జాబితాలో భారత సంచలనం స్మృతి మంధాన సత్తా చాటింది. ఇప్పటివరకు 2వ ర్యాంక్‌లో ఉన్న మంధాన.. ఐసిసి మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి ఎగబాకింది. ఎడమచేతి వాటం ప్లేయర్ అయిన మంధాన 727 రేటింగ్ పాయింట్లతో టాప్ ప్లేస్‌లో ఉంది. 2019 తర్వాత భారత వైస్ కెప్టెన్ మంధాన మళ్లీ ర్యాంకుల్లో ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా వోల్వార్డ్.. ఇటీవల 19 పాయింట్లు కోల్పోయింది. దీంతో మంధాన టాప్ వన్ నెంబర్ దిశగా దూసుకెళ్లింది. ఇంగ్లండ్ కెప్టెన్ నటాలీ స్కీవర్ బ్రంట్ 719 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో ఉంది. వోల్వార్డ్ 719 పాయింట్లతో మూడవ స్థానంలో ఉన్నారు.

## షాంటో, ముష్ఫికర్ సెంచరీలు

- బంగ్లాదేశ్ 292/3

**గాలే:** శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ బ్యాటర్లు ముష్ఫికర్, నజ్ముల్ హొస్సైన్ షాంటో సెంచరీలతో కదం తొక్కారు. అయితే టాస్ గెలిచి బ్యాటింగ్‌కు బంగ్లాదేశ్‌కు శుభారంభం దక్కలేదు. ఇనాముల్ హక్(0), షాద్మాన్(14), మోమినుల్ హక్(29) నిరాశపరిచారు. దీంతో బంగ్లాజట్టు 45పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో(136 బ్యాటింగ్), వికెట్ కీపర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం(105 బ్యాటింగ్) అద్భుత సెంచరీలతో జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 247 పరుగుల ఆజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిద్దరి జోడీని విడదీసేందుకు శ్రీలంక బౌలర్లు ఎంత ప్రయత్నించినా ఈ భాగస్వామ్యాన్ని బ్రేక్ చేయలేకపోయారు. దీంతో బంగ్లాదేశ్ జట్టు మొదటి రోజు ఆటముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 292 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. క్రీజులో బంగ్లా కెప్టెన్, వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీం ఉన్నారు. శ్రీలంక బౌలర్లలో రత్నాయకే రెండు, ఫెర్నాండో ఒక వికెట్ దక్కాయి.

## వరల్డ్ కప్ తర్వాత వన్డేలకు సోఫీ డివైన్ గుడ్‌బై



**క్రైస్ట్‌చర్చ్:** న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డెవైన్ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. టి20 ప్రపంచకప్‌ను అందించిన న్యూజిలాండ్ కెప్టెన్ వన్డేలకు అల్విదా చెప్పనుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగే వన్డే ప్రపంచ కప్ తర్వాత వన్డే ఫార్మాట్ నుంచి వైదొలగనున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని ఆమె మంగళవారం సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న మహిళల వన్డే వరల్డ్ కప్ సెప్టెంబర్ 30 నుంచి జరగనుంది. అక్టోబర్ 1న ఇండోర్‌లో ఆస్ట్రేలియాతో కివీస్ తలపడనుంది. 11వ నంబర్ ప్లేయర్‌గా వన్డేల్లో అరంగేట్రం చేసిన సోఫీ.. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది. 2020లో కెప్టెన్‌గా పగ్గాలు అందుకున్న డివైన్.. వెటరన్ సుజీ బేట్స్ తర్వాత కివీస్ తరఫున అత్యధికంగా 152 మ్యాచులు ఆడింది. ఇందులో 8 సెంచరీలు, 16 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అలాగే 3,990 పరుగులతోపాటు 107 వికెట్లు పడగొట్టింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68